Follow: @ANNTELUGU

26-03-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 88 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## మూసీ తీరాన ఓంకారేశ్వర క్షేత్రం

### 28న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**హైదరాబాద్, మహా:** మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో తొలి అడుగుగా, గండిపేట మండలం మంచిరేవులలో భారీ ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మూసీ తీరాన్ని మత సామరస్యానికి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ బృహత్కార్యాన్ని చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం పశ్చిమాన జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు 55 కిలోమీటర్ల పొడవున మూసీ అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా మంచిరేవులలో ఆలయంతో పాటు,

మిగతా 2లో

టాప్ న్యూస్




ఎవరో ఎందుకు.. నాపై పోటీకి

## సిద్ధమా?

- సిద్దిపేటలో పోటీకి సీఎంను ఆహ్వానించిన హరీష్


02



## పెట్రోల్ బంకుల్లో పరేషాన్

- రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలు
- చెప్తున్నా వినకుండా.. బంకుల్లో క్యూలు
- క్యాన్లలో పెట్రోల్ తీసుకెళ్తే కఠిన చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

02



కాల్పుల విరమణ ప్రతిపాదించిన

## ఇరాన్


- యుద్ధ నష్టపరిహారం డిమాండ్

02

ఏప్రిల్ 1 నుంచి చికెన్

## షాపుల బంద్

- మాంసం ప్రియులకు 'గడ్డు' కాలం!
- ధరల సెగ.. సమ్మె బాటలో చికెన్ వ్యాపారులు
- రాష్ట్రవ్యాప్తంగా విక్రయాల నిలిపివేత



**హైదరాబాద్:మహా:** రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చికెన్ షాపులను నిరవధికంగా మూసివేయాలని చికెన్ షాపుల యజమానుల అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. పౌల్ట్రీ కంపెనీలు (ఇంటిగ్రేటర్లు) ఇష్టారాజ్యంగా పెంచుతున్న హోల్ సేల్ ధరలకు నిరసనగా, తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ సమ్మెకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న వేలాది

మిగతా 2లో

ప్రేమించి పెళ్లాడి..

## ప్రాణం తీశాడు

- కట్నం కక్కుర్తికి గర్భవతి బలి!
- యూట్యూబర్ వైష్ణవి హత్యోదంతంలో వెలుగుచూసిన సంచలన విషయాలు



**హైదరాబాద్, మహా:** నమ్మిన వాడే నట్టేట ముంచాడు.. తోడుంటానని బాస చేసిన వాడే తుదిశ్వాస తీశాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో జరిగిన యూట్యూబర్ వైష్ణవి హత్యోదంతం సభ్య సమాజాన్ని నివ్వెరపరిచింది.

మిగతా 2లో



శ్రీరామనవమి నాడే

# కవిత పార్టీ

### ఇందూరు నుండే జంగ్ సైరన్

పార్టీ జెండా, ఎజెండా ప్రకటించనున్న ఫైర్ బ్రాండ్

తెలంగాణలో మారనున్న పొలిటికల్ ఈక్వేషన్స్

బీఆర్ఎస్ కు గట్టి షాక్ తగిలే అవకాశం

**ఇంతకాలం.. ఊహాగానాలు చర్చలకు పరిమితమైన కల్వకుంట్ల కవిత పార్టీ శ్రీరాముడి సాక్షిగా.. కార్యరూపం దాలుస్తోంది, తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనాలకు బెంచ్ మార్క్ క్రియేట్ చేసిందుకు రామనవమినే సరైన ముహూరత్‌ంగా ఎంచుకుంది. రాముడి ఆశీస్సులతోనే రాజ్యాధికారం దిశగా కవిత అడుగులు వేయనుంది. సుదీర్ఘ కాలంగా 'తెలంగాణ జాగృతి' ద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం కృషి చేసిన కల్వకుంట్ల కవిత, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయ పోరాటం కోసం సరికొత్త వేదికను సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సొంతంగా ఒక రాజకీయ పార్టీని స్థాపించాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఈ నెల 27వ తేదీన, అత్యంత పవిత్రమైన శ్రీరామనవమి పర్వదినం నాడు ఉదయం 8 గంటలకు తన నూతన పార్టీని అధికారికంగా ప్రకటించబోతున్నారు. దశాబ్ద కాలానికి పైగా తెలంగాణ ఉద్యమంలోనూ, ఆ తర్వాత రాజకీయాల్లోనూ క్రియాశీల పాత్ర పోషించిన కవిత తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది.**

**- మహా, హైదరాబాద్**

### ఇందూరులో మారునున్న పొలిటికల్ ఈక్వేషన్స్

కవిత నూతన పార్టీ ప్రకటన కార్యక్రమం తన మెట్టినింటి నుంచే ప్రారంభం కానుండటం విశేషం. సెంటిమెంట్ తో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్న ఈ వేదిక నుంచే పార్టీ పేరు, జెండా, గుర్తు మరియు విధివిధానాలను ఆమె వెల్లడించే అవకాశం ఉంది. తెలంగాణ అస్తిత్వం, రైతాంగ సమస్యలు, మహిళా సాధికారత వంటి అంశాలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ఈ పార్టీ ముందుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికల్లో తాను ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారో కూడా అదే వేదికపై స్పష్టం చేయనున్నారు. ఇప్పటికే తన అనుచరగణం మరియు జాగృతి కార్యకర్తలతో కవిత సుదీర్ఘంగా చర్చలు జరిపారని, క్షేత్రస్థాయిలో బలంగా వెళ్లేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని సమాచారం.

తెలంగాణలో ఇప్పటికే ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తుండగా, కవిత కొత్త పార్టీ ఎంట్రీతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన కవితకు, మహిళా ఓటర్లలో ఉన్న పట్టు ఈ పార్టీకి ప్లస్ పాయింట్ అయ్యే అవకాశం ఉంది. శ్రీరామనవమి నాడు విజయ ముహూర్తాన ప్రారంభించబోతున్న ఈ రాజకీయ ప్రయాణం, భవిష్యత్తులో ఏయే పార్టీలకు సవాల్ విసురుతుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీలో మరియు బయట ప్రస్తుతం ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడమే లక్ష్యంగా కవిత అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నెల 27న ఆమె చేయబోయే ప్రసంగం మరియు వెల్లడించబోయే విధివిధానాల కోసం రాజకీయ వర్గాలన్నీ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. కవిత పార్టీ ప్రకటనతో బీఆర్ఎస్ కు పెద్ద షాక్ తగిలే అవకాశం ఉండగా, క్యాడర్ చేజారకుండా బీఆర్ఎస్ నేతలు ప్రధానంగా నిజామాబాద్ జిల్లాలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



భద్రాచలం దేవస్థానం

## అభివృద్ధికి మహర్దశ

### తొలి దశ అభివృద్ధి పనులకు రూ.351 కోట్లు మంజూరు

మొత్తం అంచనా వ్యయం 586 కోట్లు

నిధుల విడుదల చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

హామీ నిలబెట్టుకున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** భద్రాచలం దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. దేవాదాయ శాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ, భద్రాచలం పునరాభివృద్ధి-పునరుజ్జీవన కార్యక్రమాల కోసం మొదటి దశలో భాగంగా రూ.351 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఏడాది భద్రాచలం పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈ నిర్ణయం వెలువడటం విశేషం. ఈ ప్రక్రియలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిరంతర


మిగతా 2లో

వంద కొత్త విమానాశ్రయాలు..

## 200 హెలిపాడ్లు

- కేంద్ర కేబినెట్ వరాల జల్లు
- ఉడాన్ 2.0 విస్తరణ..
- జాతీయ భద్రతకు డిజిటల్ భరోసా

02









రాకేష్ రెడ్డి వ్యాఖ్యలపై

## భగ్గుమన్న మంత్రులు

తీవ్రంగా స్పందించిన పొన్నం, శ్రీధర్ బాబు, సీతక్క

అసెంబ్లీలో గందరగోళం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. సభలో మంత్రి పొన్నం, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. ఇప్పపువ్వు సారా మంచిదే గానీ.. ఇందిరమ్మ పేరు పెట్టకండంటూ రాకేష్‌రెడ్డి

మిగతా 2లో



## కదంతొక్కిన జర్నలిస్టులు

*ఐ అండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడి*

*జర్నలిస్టుల ర్యాలీ, ధర్నాతో దద్దరిల్లిన సమాచార భవన్*

**హైదరాబాద్, మహా:** జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా వందలాది జర్నలిస్టులు బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐఅఃడ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో

మిగతా 2లో

పోలీసు విధులకు

## క్రీడలే ప్రాణాధారం

### క్రీడలు నా కెంతో ఇష్టం

ప్రపంచ స్థాయి అథ్లెట్లకు కేంద్రంగా తెలంగాణ

గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, మహా :** క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు మరియు పోలీసు విధులకు ప్రాణధారమని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం '74వ బి.ఎన్. మల్లిక్ అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025-26' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ....తనకు క్రీడలంటే అపారమైన ప్రేమని, గతంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో క్రీడల శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.

మిగతా 2లో

తెలుగు
మహా పత్రిక


# పెట్రోల్ బంకుల్లో పరేషాన్

- రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలు
- చెప్తున్నా వినకుండా.. బంకుల్లో క్యూలు
- క్యాన్లలో పెట్రోల్ తీసుకెళ్తే కఠిన చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్:మహా:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ మరియు ఎల్పీజీ సిలిండర్ల కొరత ఉందంటూ సాగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యంత స్పష్టంగా ప్రకటించారు. అసెంబ్లీ వేదికగా , మీడియా ముఖంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో వచ్చే రెండు నెలల వరకు ప్రజల అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాల కారణంగా ఒక్కసారిగా డిమాండ్ 25 శాతం పెరిగినప్పటికీ, ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా ముందస్తు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా 17,246 కిలోలీటర్ల ఇంధన డిమాండ్ ఉండగా, అంతకంటే ఎక్కువగా 17,898 కిలోలీటర్లను సరఫరా చేశామని గణాంకాలతో సహా వెల్లడించారు. సాధారణ సగటు కంటే 22 శాతం అదనంగా సరఫరా కొనసాగుతోందని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా 16,000 కిలోలీటర్ల బఫర్ స్టాక్‌ను కూడా సిద్ధంగా ఉంచామని ఆయన పేర్కొన్నారు.నగరంలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో కనిపిస్తున్న 'నో స్టాక్' బోర్డులపై మంత్రి స్పందిస్తూ, అది ఇంధనం లేక కాదని, కేవలం ట్యాంకర్లు చేరుకోవడంలో జరుగుతున్న స్వల్ప జాప్యం వల్ల మాత్రమేనని వివరించారు. రవాణా వ్యవస్థను మరింత వేగవంతం చేసేందుకు అదనంగా 1,200 ట్యాంకర్లను రంగంలోకి దించామని, ప్రతి బంకుకు సకాలంలో సరఫరా అందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలోని 596 పెట్రోల్ బంకులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఏ ఒక్క బంకును కూడా మూసివేయడానికి ప్రభుత్వం అనుమతించదని స్పష్టం చేశారు. యుద్ధం వల్ల పెట్రోల్ దొరకదనే భయం అనవసరమని, ఓఎన్జీసీ ద్వారా నిరంతర సరఫరా కొనసాగుతోందని, వ్యూహాత్మక చమురు నిల్వలు కూడా 60 నుంచి 65 రోజులకు సరిపడా ఉన్నాయని తెలిపారు.ప్రజలు ఆందోళనతో క్యాన్లు, డబ్బాల్లో పెట్రోల్ మరియు డీజిల్ నింపుకుని వెళ్లడంపై మంత్రి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇలా బహిరంగంగా క్యాన్లలో ఇంధనాన్ని తీసుకెళ్లడం అత్యంత ప్రమాదకరమే కాకుండా చట్ట విరుద్ధమని, అగ్నిప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. అలాగే గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లు కూడా సరిపడా ఉన్నాయని, వినియోగదారులు ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని చెప్పారు. కమర్షియల్ సిలిండర్ల అక్రమ మార్పిడిపై ఇప్పటికే దాడులు నిర్వహించి 2,952 సిలిండర్లను సీజ్ చేశామని గుర్తు చేశారు. ప్రజలు సంయమనం పాటించాలని, కేవలం సాధారణ అవసరాలకు మించి ఇంధనాన్ని నిల్వ చేసి కృత్రిమ కొరతకు కారణం కావొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కదంతొక్కిన జర్నలిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్"కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడు జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్,కృష్ణమాచారి, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కే. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి, కో కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, సంతోష్, బ్రహ్మం,మహిళా నాయకులు సాజిదా, మంజులారెడ్డి, శివపార్వతి, సుస్మిత, తీగవరపు శాంతి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు.

# భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి మహర్దశ



(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షణ, కృషి కీలక పాత్ర పోషించాయి. ఆమె తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రతిపాదనలు వేగంగా ఆమోదం పొందగా, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. మొదటి దశలో గోదావరి ఘాట్ విస్తరణ, ఆధునిక వసతులతో అభివృద్ధి, ఆలయ సముదాయంవిస్తరణ, పరిసర ప్రాంతాల సదుపాయాల మెరుగుదల వంటి ప్రధాన పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గోదావరి ఘాట్‌కు రూ.75 కోట్లు, ఆలయ సముదాయానికి రూ.180 కోట్లు, పరిసర అభివృద్ధికి రూ.96 కోట్లు కేటాయించారు. మొత్తం మూడు దశల్లో అమలు కానున్న ఈ ప్రాజెక్టులో రెండో దశలో కాపా రామలక్ష్మమ్మ భూమిలో రూపాంతరాత్మక అభివృద్ధి, మూడో దశలో భద్రాచలం పట్టణ సమగ్ర అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.586 కోట్లుగా అంచనా వేయబడింది. అగమ శాస్త్రాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనుల అమలును రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వుల పట్ల మంత్రి కొండా సురేఖ సంతోషం వ్యక్తంచేశారు.. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, భద్రాచలం క్షేత్ర వైభవాన్ని మరింత అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించడంతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుతుందని తెలిపారు. ఈ నిర్ణయం భద్రాచలం అభివృద్ధి చరిత్రలో కీలక మలుపుగా నిలుస్తూ, ప్రాంతానికి నిజమైన మహర్దశకు నాంది పలుకుతోంది.

# మూసీ తీరాన ఓంకారేశ్వర క్షేత్రం

## 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

పురానాపూల్ వద్ద భారీ మసీదు, గౌలిగూడలో గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. మంచిరేవులలో 800 ఏళ్ల వీరభద్రస్వామి, 1400 ఏళ్ల మచిలేశ్వర ఆలయాల సమీపంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొత్త ఆలయాన్ని నిర్మిస్తున్నారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సలహాలతో ఆలయ నిర్మాణ శైలిని ఖరారు చేశారు. 64 అడుగుల ఎత్తుతో నిర్మించే దీని గర్భాలయం, యాదాద్రి తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్దదిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆలయం వద్ద 2,000 వాహనాల పార్కింగ్, ఓఆర్ఆర్ నుంచి విశాలమైన రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, మూసీ నదిపై చిన్న ఆనకట్ట నిర్మించి, నీటిని నిల్వ చేస్తారు. నది మధ్యలో ఏర్పాటు చేసే ఓ దీవిపై 100 అడుగుల శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు, బోటింగ్ సౌకర్యం, పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.700 కోట్లుగా అంచనా వేస్తుండగా, నిధుల సమీకరణకు దాతలు, ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 28న ఉదయం 8:30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి శృంగేరి పీఠం ప్రతినిధులు హాజరుకానున్నారు.

# ప్రేమించి పెళ్లాడి.. ప్రాణం తీశాడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రేమ పేరుతో వెంటపడి, ప్రాణాలు తీసుకుంటానని బెదిరించి పెళ్లాడిన భర్త హరిబాబే.. చివరకు ఆమె పాలిట కాలయముడయ్యాడు. కేవలం నాలుగు ఎకరాల పొలం, మరికొంత కట్నం వస్తుందనే దురాశతో, నాలుగు నెలల గర్భవతి అని కూడా చూడకుండా కన్నకూతురిలా సాదుకున్న అత్తింటి వారికే తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ కిరాతకానికి సంబంధించిన సంచలన విషయాలను పోలీసులు బుధవారం వెల్లడించారు.

### ప్రేమ ముసుగులో వంచన.

వైష్ణవి కోరుట్ల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో చేరింది. శిక్షణలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే క్రమంలో అక్కడ పేషెంట్ అటెండర్‌గా పనిచేసే హరిబాబు కంటపడింది. ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటపడ్డాడు. తొలుత నిరాకరించినప్పటికీ, 'నీవు లేకుంటే బతకలేను' అంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో వైష్ణవి కనికరించి అతని ప్రేమను అంగీకరించింది. ఇరు కుటుంబాల నుంచి వ్యతిరేకత వచ్చినా, వైష్ణవి తల్లిదండ్రులను ఒప్పించి పది నెలల క్రితం వీరి వివాహం ఘనంగా జరిగింది.

### ఇల్లరికపు అల్లుడికి నివాసం

హరిబాబు కుటుంబం అతడిని వెలివేయడంతో, వైష్ణవి తల్లిదండ్రులు అతడిని తమ ఇంటికి ఆహ్వానించి ఇల్లరికపు అల్లుడిగా గౌరవించారు. వైష్ణవి యూట్యూబ్ వీడియోల ద్వారా సంపాదిస్తుండటంతో, హరిబాబు తన ఉద్యోగాన్ని వదిలేసి ఆమెతో కలిసి వీడియోలు చేసేవాడు. ఆమె కుటుంబం అతడికి రెండు గుంటల స్థలం కొనిచ్చి, ఇల్లు కట్టించేందుకు కూడా సిద్ధమైంది. అయితే, హరిబాబు కుటుంబ సభ్యులు మాత్రం అతని మనసులో విషం నింపారు. వైష్ణవిని వదిలించుకుని మరో పెళ్లి చేసుకుంటే 4 ఎకరాల భూమితో పాటు రూ.20 లక్షల కట్నం వస్తుందని ఆశ చూపారు. ఆ ఆస్తి పాశవికానికి హరిబాబు పశువులా మారాడు.



### గర్భవతి అని వేడుకున్నా

ఈ నెల 16వ తేదీ రాత్రి నిద్రిస్తున్న వైష్ణవిపై హరిబాబు దాడికి తెగబడ్డాడు. దిండుతో ముఖాన్ని అదిమి పట్టి, గొంతు నులిమి కిరాతకంగా వ్యవహరించాడు. తాను నాలుగు నెలల గర్భవతిని అని, కడుపులోని బిడ్డనైనా చూడమని ఆమె ప్రాధేయపడినా ఆ మృగాడి మనసు కరగలేదు. గొంతు నులిమి చంపడమే కాకుండా, విచక్షణ రహితంగా కత్తితో పొడిచి ఆమె ప్రాణాలను గాలిలో కలిపేశాడు. పై గదిలో ఉన్న తల్లిదండ్రులకు అనుమానం రాకుండా 'మేము సరదాగా గడుపుతున్నాం' అన్నట్లుగా నటించి వారిని నమ్మించాడు. మరుసటి రోజు ఉదయం ఏమీ తెలియనట్లు బ్రష్ చేసుకుని, అత్తింటి వారు కొనిచ్చిన బైక్‌పైనే పరారయ్యాడు.

### ముగ్గురు నిందితుల అరెస్టు

వైష్ణవి తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, హరిబాబుతో పాటు అతనిని హత్యకు ప్రేరేపించిన తల్లి మరియు ఇద్దరు సోదరులను అరెస్టు చేశారు. కట్టుకున్న భార్యనే కాకుండా, ఇంకా లోకాన్ని చూడని తన బిడ్డను కూడా పొట్టనబెట్టుకున్న హరిబాబుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక కళాకారిణిగా ఎంతోమందిని అలరించిన వైష్ణవి, ఇలా తన సొంత మనిషి చేతిలోనే బలికావడం చూసి మాదాపూర్ గ్రామం కన్నీరుమున్నీరవుతోంది.

# కాల్పుల విరమణ ప్రతిపాదించిన ఇరాన్

## యుద్ధ నష్టపరిహారం డిమాండ్

**మహా:**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది. యుద్ధ నష్టపరిహారం, హార్ముజ్ జలసంధిపై సార్వభౌమాధికారాన్ని కోరుతూ కాల్పుల విరమణ ప్రతిపాదన చేసింది. సీజ్‌ఫైర్ ప్లాన్‌పై ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పందిస్తూ అమెరికాపై విమర్శలు గుప్పించారు. "మీ ఓటమిని శాంతి ఒప్పందంగా పిలవొద్దు. ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులను మేం అంగీకరించబోం" అని ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. యుద్ధం ముగింపుపై అమెరికాతో చర్చల వార్తలను కూడా ఖండించారు. అమెరికా యుద్ధవిరమణ ప్రతిపాదనలు చేసిన తర్వాత ఇరాన్ కూడా.. కీలక ప్రతిపాదనలు చేసింది. అమెరికా వ్యూహాత్మక శక్తి వ్యూహాత్మక ఓటమిగా మారిందని ఇరాన్ ఎద్దేవా చేసింది. మొత్తంగా రెండు దేశాలు శాంతిదిశగా అడుగులు వేస్తుండడంతో త్వరలోనే యుద్ధం ముగుస్తుందన్న ఆశలు ఉన్నాయి.

# ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్

- మాంసం ప్రియులకు 'గడ్డు' కాలం!
- ధరల సెగ.. సమ్మె బాటలో చికెన్ వ్యాపారులు
- రాష్ట్రవ్యాప్తంగా విక్రయాల నిలిపివేత


(మొదటిపేజీ తరువాయి)

రిటైల్ షాపులు ఈ బంద్‌లో పాల్గొననున్నాయి. దీని వల్ల సామాన్య వినియోగదారులకు చికెన్ దొరకడమే కాకుండా, హోటల్ , రెస్టారెంట్ పరిశ్రమపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా చూపే అవకాశం ఉంది.ఈ నిరసనకు ప్రధాన కారణం భారీ పౌల్ట్రీ కంపెనీల గుత్తాధిపత్యమని వ్యాపారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కోడి పిల్లలు, మేత ధరలు పెరిగాయనే నెపంతో కంపెనీలు హోల్ సేల్ ధరలను అమాంతం పెంచుతున్నాయని, అయితే రిటైల్ వ్యాపారులకు ఇచ్చే కమీషన్ మాత్రం దశాబ్దాలుగా మార్పు లేకుండా అలాగే ఉందని వారు మండిపడుతున్నారు. ప్రస్తుతం పెరిగిన షాపు అద్దెలు, కరెంటు బిల్లులు, పనివాళ్ల జీతాలు మరియు ఇతర నిర్వహణ ఖర్చుల దృష్ట్యా, కంపెనీలు నిర్ణయించే మార్జిన్లతో వ్యాపారం చేయడం సాధ్యం కాదని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. కిలో చికెన్‌పై తమకు వచ్చే కమీషన్‌ను గణనీయంగా పెంచాలని లేదా కంపెనీలే విక్రయ ధరలను నియంత్రించాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.అసోసియేషన్ నాయకులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రతినిధులతో సమావేశమై ఈ నిర్ణయానికి మద్దతు కూడగట్టారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని పౌల్ట్రీ కంపెనీలతో చర్చలు జరపాలని, మధ్యతరగతి వ్యాపారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం నుంచి గానీ, కంపెనీల నుంచి గానీ సానుకూల స్పందన రాకపోతే ఏప్రిల్ 1 నుంచి ఒక్క షాపు కూడా తెరవబోమని భీష్మించుకు కూర్చున్నారు. గతంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి నిరసనలు జరిగినప్పటికీ, ఈసారి మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఏకతాటిపైకి వచ్చి సమరానికి సిద్ధమయ్యారు. ఈ ఆకస్మిక పరిణామంతో ఆదివారం నాడు విందు వినోదాలు చేసుకునే సామాన్యులు , చికెన్ వ్యాపారంపై ఆధారపడిన వేలాది మంది కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# వంద కొత్త విమానాశ్రయాలు.. 200 హెలిపాడ్లు

- కేంద్ర కేబినెట్ వరాల జల్లు
- ఉడాన్ 2.0 విస్తరణ..
- జాతీయ భద్రతకు డిజిటల్ భరోసా

**ఢిల్లీ: మహా:** దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమాన ప్రయాణ సౌకర్యాన్ని చేరువ చేస్తూ, సామాన్యుడి ఆకాశయాన కలను సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. ముఖ్యంగా ప్రాంతీయ విమాన అనుసంధానతను బలోపేతం చేయడమే లక్ష్యంగా, సవరించిన 'ఉడాన్' (ఉడే దేశ్ కా ఆమ్ నాగ్రిక్) 2.0 పథకానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రాబోయే పదేళ్ల కాలంలో సుమారు 28,840 కోట్ల రూపాయలను వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. వెనుకబడిన ప్రాంతాల్లో విమానయాన మౌలిక సదుపాయాలను సమూలంగా మార్చడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నూతన పథకం కింద దేశవ్యాప్తంగా కొత్తగా 100 విమానాశ్రయాలను అభివృద్ధి చేయడంతో పాటు, పర్వత ప్రాంతాలు మరియు మారుమూల ప్రాంతాల ప్రజల కోసం 200 హెలిపాడ్లను ఆధునీకరించనున్నారు. దీనివల్ల దేశంలో ఇప్పటివరకు విమాన సౌకర్యం లేని మరో 120 కొత్త ప్రాంతాలకు ఎయిర్ కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. విమానయాన సంస్థలకు ప్రోత్సాహకరంగా ఉండేలా 'వయబిలిటీ గ్యాప్ ఫండ్' కింద 10,043 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే విమానాశ్రయాల నిర్వహణ మరియు మరమ్మతుల కోసం ప్రత్యేకంగా 2,577 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ విస్తరణతో పర్యాటక రంగం పుంజుకోవడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. దేశ భద్రత మరియు విదేశీయుల రాకపోకల పర్యవేక్షణ విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు 'ఇమ్మిగ్రేషన్, వీసా, విదేశీయుల రిజిస్ట్రేషన్ ట్రాకింగ్' ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 1,800 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలోకి వచ్చే విదేశీయుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో నిశితంగా ట్రాక్ చేసే అధునాతన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది సరిహద్దు భద్రతతో పాటు అంతర్గత భద్రతను పర్యవేక్షించడంలో భద్రతా సంస్థలకు ఒక రక్షణ కవచంలా పనిచేయనుంది. పర్యావరణ పరిరక్షణలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచేలా 'నేషనల్ డిటర్మైండ్ కాంట్రిబ్యూషన్' విధానానికి కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. భవిష్యత్ అవసరాల కోసం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి, సౌర మరియు పవన వంటి సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 52 శాతం విద్యుత్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నిర్ణయంతో కర్బన ఉద్గారాల తగ్గింపులో భారత్ తన నిబద్ధతను చాటుకోవడమే కాకుండా, హరిత ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా బలమైన అడుగులు వేస్తోంది.



# రాకేష్ రెడ్డి వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రులు

(మొదటిపేజీ తరువాయి)



వ్యాఖ్యలపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, వాకిటి శ్రీహరి మండిపడ్డారు. రాకేష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. రాకేష్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. రూల్స్ ప్రకారమే సభ నడవాలని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేల తీరుపై మాజీ మంత్రి హరీష్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్,బీజేపీ ఎమ్మెల్యేలు సభ సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. చర్చను పక్కదారి పట్టించడం సరైన పద్ధతి కాదన్నారు. ఒక్క విషయాన్ని పట్టుకుని గంట సమయం వృథా చేయడం సరికాదన్నారు. రాకేష్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్న స్పీకర్.. కొత్త సభ్యులు పొరపాటు చేస్తే ఫ్లోర్ లీడర్ సరిచేయాలని సూచించారు. తానేం తప్పు మాట్లాడలేదన్న రాకేష్‌రెడ్డి.. ప్రతి స్కీమ్‌కు ఇందిరమ్మ పేరు పెడుతున్నారు.. ఈ స్కీమ్‌కు ఆమె పేరు పెట్టొద్దని చెప్పానంటూ రాకేష్‌రెడ్డి వివరణ ఇచ్చారు. కావాలంటే హౌస్ కమిటీ వేయండి.. ఇందిరమ్మపై తప్పుగా ప్రచారం చేస్తుంటే తానూ మాత్రమే ఖండించానని రాకేష్‌రెడ్డి అన్నారు. ఇప్పపువ్వు సారా ఫ్యాక్టరీకి ఇందిరమ్మ పేరు పెట్టొద్దని చెప్పడం తప్పేమీ కాదంటూ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని.. ఇందిరమ్మ పేరు ఎందుకు తెచ్చారో రాకేష్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిందేనని మంత్రి సీతక్క అన్నారు.



# ఎవరో ఎందుకు.. నాపై పోటీకి సిద్ధమా?

## సిద్దిపేటలో పోటీకి సీఎం ఆహ్వానించిన హరీష్

**హైదరాబాద్:మహా:** రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తలకిందులుగా తపస్సు చేసినా అది సాధ్యం కాదని, ఆయన కేవలం పగటి కలలు కంటున్నారని హరీష్ రావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు సిద్దిపేట నియోజకవర్గంపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సిద్దిపేటలో ఎవరినో పంపి పోటీ చేయించడం ఎందుకు, దమ్ముంటే రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. "వేరే అభ్యర్థులెందుకు.. నువ్వే రా రేవంత్! సిద్దిపేట గడ్డపై పోటీకి నిన్ను నేనే స్వయంగా ఆహ్వానిస్తున్నా" అంటూ ఘాటుగా స్పందించారు. సిద్దిపేట ప్రజలు అభివృద్ధిని, నిజాయితీని గౌరవిస్తారని, అక్కడ తనను ఓడించడం రేవంత్ వల్ల అయ్యే పని కాదని ధీమా వ్యక్తం చేశారు. కేవలం ప్రగల్భాలు పలకడం మానేసి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని హరీష్‌రావు హితవు పలికారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, కేవలం విపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని హరీష్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించాలని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అహంకార పూరిత ధోరణి ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెస్తుందని, మరోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం అసాధ్యమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# పోలీసు విధులకు క్రీడలే ప్రాణాధారం

- క్రీడలు నా కెంతో ఇష్టం
- ప్రపంచ స్థాయి అథ్లెట్లకు కేంద్రంగా తెలంగాణ
- గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది తమ యూనిఫాం పక్కన పెట్టి, క్రీడా జెర్సీల్లో స్నేహాన్ని మరియు ఆరోగ్యకరమైన పోటీని జరుపుకోవడానికి ఒకచోట చేరడం అసాధారణమైన విషయమని కొనియాడారు. భవిష్యత్తులో ఈ పోటీల్లో మహిళా పోలీసుల భాగస్వామ్యం ఇంకా ఎక్కువగా ఉండాలని, వారి భాగస్వామ్యం మన బలగాలను మరింత బలోపేతం చేస్తూ అందరినీ కలుపుకొని పోయేలా చేస్తుందని ఆకాంక్షించారు. ఒక పోలీసు అధికారికి క్రీడలు కేవలం హాబీ మాత్రమే కాదని, అవి వారిని మానసికంగా చురుగ్గా ఉంచుతూ విధి నిర్వహణలోని కఠినమైన అవసరాలకు శారీరకంగా సిద్ధం చేస్తాయని వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి కొత్త కార్యక్రమాలతో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ స్థాయి అథ్లెట్లకు కేంద్రంగా ఎదుగుతోందని ప్రశంసించిన గవర్నర్, క్రీడాకారులందరూ పూర్తి ఉత్సాహంతో, నిష్పక్షపాతంగా ఆడుతూ క్రీడాస్ఫూర్తిని నిలబెట్టాలని హితవు పలికారు. గెలుపోటముల కంటే ప్రదర్శించే అంకితభావమే ముఖ్యమని పేర్కొంటూ, అందమైన భాగ్యనగరంలో క్రీడాకారులందరూ పోటీలను ఆస్వాదించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక ఛాంపియన్‌షిప్‌కు హైదరాబాద్ వేదిక కావడం తమకు అత్యంత ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. గవర్నర్ రాక ఈ కార్యక్రమ వైభవాన్ని పెంచడమే కాకుండా యువ ప్రతిభకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. పోలీస్ సేవలో క్రీడలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు.ఫుట్ బాల్ క్రీడలో ప్రతిబింబించే జట్టుకృషి, వ్యూహం, ఓర్పు, త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం మరియు సహచరులపై నమ్మకం వంటి లక్షణాలు ప్రతి పోలీసు అధికారికి అవసరమని వివరించారు. ఈ ఛాంపియన్‌షిప్ కేవలం పోటీ మాత్రమే కాదని, దేశవ్యాప్త పోలీసు బలగాల మధ్య పరస్పర సహకారం, స్నేహం మరియు ఐక్యతకు ఒక వేడుక అని అభివర్ణించారు. మనం వేర్వేరు రాష్ట్రాల్లో పనిచేస్తున్నప్పటికీ దేశ పౌరులను రక్షించడం, చట్టాన్ని నిలబెట్టడం మరియు శాంతిభద్రతలను కాపాడటమే మన అందరి ఏకైక లక్ష్యమని ఇటువంటి వేదికలు గుర్తు చేస్తాయని గుర్తుచేశారు. క్రీడాకారులు తమ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తుంచుకోవాలని, నిజాయితీతో కూడిన నిష్పక్షపాత పోటీని ప్రదర్శించాలని కోరారు. ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు అవిశ్రాంతంగా కృషి చేసిన సిబ్బందిని అభినందిస్తూ, ఉత్తమ జట్టు విజయం సాధించాలని ఆశిస్తూ ప్రసంగాన్ని ముగించారు. ఇన్స్పెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ ( స్పోర్ట్స్) గజరావు భూపాల్ స్వాగతోపన్యాసం చేస్తూ... తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఫుట్బాల్ క్రీడకు చాలా ఆదరణ ఉండేదని పోలీస్ శాఖకు చెందిన పలువురు క్రీడాకారులు ఫుట్బాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణించారని గుర్తు చేశారు. హైదరాబాద్ లోని ఐదు గ్రౌండ్లలో ఫుట్బాల్ మ్యాచ్ లు కొనసాగుతాయని పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్, డిజిపి, తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఉత్తరప్రదేశ్ క్రీడా శాఖ మంత్రిగా వ్యవహరించిన గవర్నర్ ఛాంపియన్షిప్ కు ప్రారంభోత్సవం చేయడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల ఫుట్బాల్ జట్ల మార్చ్ పాస్ట్ అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ మ్యాచ్ ను గవర్నర్ డిజిపి తదితరులు కొద్ది సేపు వీక్షించారు. ఆర్ బి వి ఆర్ ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, అడిషనల్ డిజిపిలు సంజయ్ కుమార్ జైన్, అనిల్ కుమార్, డిఐజి అభిషేక్ మహంతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### భారత పార్లమెంట్ లోక్ సభ వ్యాలిడేషన్ యాక్ట్ కు

## వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన...

**విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి...**



**మహా :** సదాశివపేట ప్రభుత్వ పెన్షనర్ దారులకు మార్చ్ 25.3.2025 దుర్దినమని సదాశివపేట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశంఆధ్వర్యంలో బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు వెళ్లి డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోని పింఛన్ దారులకు 25 మార్చ్2025 దుర్దినమని ఈ వ్యాలిడేషన్ కు వ్యతిరేకంగా మన రాష్ట్ర సంఘం పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. భారత పార్లమెంట్ లోక సభలో వ్యాలిడేషన్ యాక్ట్ ను ఆమోదించిన ఆ చట్ట ప్రకారం01.01.2026కంటే పదవి విరమణ వారిని01.01.2026 తరువాత రిటైర్డ్ అయిన వారికి వేరువేరుగా విభజించి రాబోయేవేతన సవరణ సంఘం సిఫారసుల వలననష్టం జరుగుతుందని. పెన్షనర్లను వీడే దియోద్దని ఉద్దేశంతోనే రాష్ట్ర సంఘం పిలుపుమేరకు అధికారులకు వినతి పత్రం అంద చేయడం జరిగింది. ఇట్టి వినతిని తాసిల్దార్ ద్వారా దేశ ప్రధాని చేరవేయడం కొరకు ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి తుక్కుడే దాస్. కోశాధికారి చీల విశ్వనాథం. జిల్లా సంయుక్త కార్యదర్శి టి శ్రీనివాస్ యాదవ్. అసోసియేట్ అధ్యక్షులు బుచ్చప్ప. ఉపాధ్యక్షులు సత్యనారాయణ చిప్పి. నిర్మల. సంయుక్త కార్యదర్శి భీమ్రావు. కార్యనిర్వాక కార్యదర్శి మల్లేశం. ప్రచార కార్యదర్శి వారాధి కాశీనాథ్. జిల్లా కౌన్సిల్ సభ్యులు. చిగుర్తి అంబయ్య. అంబటి విశ్వనాథం. పట్లూరి వీరప్ప. ముఖ్య సలహాదారుడు బోడపల్లి శంకరప్ప. చింత జనార్ధన్. పెంటయ్య తదితర పింఛన్లు పాల్గొన్నారు.

# రైతుల పట్ల దౌర్జన్యాలు సహించం

**డీసీసీబీ జప్తులు**

**ఆపకపోతే ప్రత్యక్ష ఆందోళనలు**




**నేలకొండపల్లి, మహా:** రైతుల పట్ల ప్రభుత్వం రుణాల రికవరీ విషయంలో దౌర్జన్యాలకు పాల్పడుతుందని బీజెపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆరోపించారు. డీసీసీబీ అధికారుల రుణాల రికవరీ జప్తులను వెంటనే ఆపాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పుట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను డిప్యూటీ తహశీల్దార్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..రైతాంగం పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గేదెల రుణాల విషయంలో డీసీసీబీ అధికారులు ఇళ్ల 'వద్దకు వచ్చి జప్తులు చేస్తామని. నోటీసులు అందించి భయందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన రుణాల కు సబ్సీడీ ఇవ్వకుండా "ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. సబ్సీడీ ఇచ్చే వరకు జప్తులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీసీసీబీ అధికారుల తీరు మారకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీజన్ ప్రారంభమైనప్పటికీ నేటి వరకు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. గ్రామాలలో దళారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు పి.సత్యనారాయణ, మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, కొండా హర్షవర్ధన్, కృష్ణారావు, కళ్యాణం నాగేశ్వరరావు, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి, తొగాటి నాగచారీ, కొదమగుళ్ల స్వామిదాసు, కొండా ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



### ఎద్దులను అక్రమంగా

## తరలిస్తున్న వాహనం

**బూర్గంపహాడ్, మహా :**9 ఎద్దులను అక్రమంగా తరలిస్తూ వెళ్తున్న TG 29 T 7060 నంబర్ గల వాహనాన్ని బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకున్నారు .ఈ ఘటనలో ఎద్దులను , అసహనీయ పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఎద్దులను పాలవంచలోని అన్నపూర్ణ గో సంరక్షణ సమితికి అప్పగించారు.ఈ విషయాన్ని సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ వెల్లడిస్తూ, 9 ఎద్దుల్లో 5 ఎద్దుల పరిస్థితి అత్యంత విషమంగా ఉందని తెలిపారు. వాటికి తక్షణ వైద్య చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటన పశువుల రక్షణపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

### భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేయనున్న చంద్రబోస్ అభిమాన సంఘం

**భద్రాచలం మహా :** శ్రీరామ నవమి సందర్భంగా సినీ గేయరచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పులిహోర, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం భద్రాచలం పట్టణంలోని ఉదయ భాస్కర్ సెంటర్ కూడలి వద్ద ఎస్‌డీ మెడికల్ షాప్ సమీపంలో నిర్వహించబడుతుంది. రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు తోటమల్ల, ప్రధాన కార్యదర్శి కుప్పాల నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కర్ర అనిల్ రెడ్డి, కార్యదర్శి గుమ్మడపు దుర్గాప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ముందస్తు అరెస్టులు ప్రజాస్వామికం..

**సేవాలాల్ అధ్యక్షులు రవి నాయక్..**




**మణుగూరు, మహా :** సేవాలాల్ సేన పిలుపు మేరకు గిరిజన హక్కుల కోసం తలపెట్టిన ధర్నాను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని సేవాలాల్ సేన మణుగూరు మండల అధ్యక్షులు రవి నాయక్ తీవ్రంగా ఖండించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ నాయక్ ల పిలుపు మేరకు అన్ని సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గిరిజన ధర్నాకు ముందస్తుగా నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా సేవాలాల్ మహారాజ్ గుడిని హైదరాబాద్‌లోనే నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతియుతంగా తమ సమస్యలను వెల్లడించేందుకు చేపట్టిన ధర్నాను అడ్డుకోవడం సమంజసం కాదని, తమ గోడును తెలియజేసే హక్కు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం సరైంది కాదని, అర్ధరాత్రి నక్సలైట్ల మాదిరిగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఇటువంటి చర్యలతో గిరిజనుల ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.



### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్

## పీడీ రవీంద్రనాథ్ సమీక్ష

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్ బుధవారం నాడు సమీక్ష నిర్వహించారు. మండలంలోని మొరంపల్లి బంజారా గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు.పోస్ట్ ఫాక్టో వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణ పనుల పురోగతిని దగ్గరగా గమనించారు. పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులను బిల్లులు పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎల్ 3 లబ్ధిదారులతో మాట్లాడి త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయని వారికి భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జమలారెడ్డిని కలిసి గృహ నిర్మాణాల ప్రగతి ప్రణాళికపై చర్చించారు. పూర్తి దశలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేపర్ ప్రకటనలకే పరిమితం...

- ఇచ్చిన హామీలు అమల్ చేయడంలో పూర్తిగా విఫలం...
- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు...



**మహా, సదాశివపేట :** కెసిఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూడా కొనసాగించలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన 6 గ్యారంటీలకు సరైన బడ్జెట్ కేటాయించకుండా ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయిందని ప్రభుత్వంప్రవేశ పెట్టిన బడ్జెట్ పేపర్ ప్రకటనలకు పరిమితమని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం మహా విలేకరితో మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా .రైతు బంధు 15 వేలు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ తులం బంగారం వంటి కీలక పథకాలు నెరవేర్చలేని అధికార కాంగ్రెస్ పార్టీ అమలు చేయడం లేదని పేదల సంక్షేమ పథకాల్లో మధ్యలోనే నిలిచి పోయాయని వారు పేర్కొన్నారు. పాత పథకాల అమలులోనే విఫలమైన ప్రభుత్వం కొత్త హామీలను ఎలా నేర్చుతుందో అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలకు బడ్జెట్లో సరైన నిధులు కేటాయింపు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఈ బడ్జెట్లో కేవలం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు. ప్రభుత్వం వెంటనే తన విధానాన్ని మార్చుకొని పథకాల అమలుపై దృష్టి సారించాలని లేకపోతే ప్రజల తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి పడి...**

### వ్యక్తికి తీవ్ర గాయాలు...

**ఖమ్మం తరలింపు**



**నేలకొండపల్లి, మహా:** ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి పడి తీవ్ర గాయాలైన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం గ్రామానికి చెందిన షేక్ ఇమాంసాహెబ్ (40) అనే వ్యక్తి బుధవారం ఇంట్లో కొబ్బరికాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి జారి పడ్డాడు. దీంతో సదరు వ్యక్తి కి తీవ్ర గాయాలైయ్యాయి. ఘటనా స్థలం లో 108 సిబ్బంది ఈయంటీ వెంకట్, పైలెట్ పాలడుగు రామకృష్ణ ప్రధమ లు ప్రధమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.


## బంగారు పతకాలను సాధించిన మహిళా కానిస్టేబుల్

**సుష్మను అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిసున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ డి.సుష్మ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెం విభాగాలలో బంగారు పతకాలను సాధించారు. విశేష ప్రతిభ కనబరచి పంజాబ్ లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఐదవ స్థానంలో నిలిచిన సుష్మను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ముఖ్యమంత్రి నిధి ఒక వరం లాంటిది

**సీఎంఆర్ చెక్కులు అందజేసిన టిజిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి...**



**మహా :** సదాశివపేట పేద ప్రజలకు ముఖ్యమంత్రి నీది సహకారం ఒక వరం లాంటిదని టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నా బుధవారం మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన ఐదు మంది బాధితులు ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు రెండు లక్షలు రెండు లక్షల సిఎంఆర్ చెక్కులను గ్రామ సర్పంచ్ జుర్రిగల తులసి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్మల జగ్గారెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారుఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పెద్దలు చర్యల ఆంజనేయులు.ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు. మండల పార్టీ అధ్యక్షుడు సిద్దన్న. మాజీ సర్పంచ్లు శ్రీనివాస్ రెడ్డి శ్యామల గోపాల్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శైలేందర్ రెడ్డి. సత్యనారాయణ. మహేష్. లబ్ధిదారులు భూతపిల్లి మానేయ ముక్క గొల్ల శోభ మంగళ్ శ్రీనివాస్. బ్యాగరీ పుష్పమ్మ . పట్లోళ్లవిష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి



**నేలకొండపల్లి, మహా:** అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని తిరుమలాపురం పంచాయతీ సర్పంచ్ కమదన ప్రవీణ్ సూచించారు. మండలం లోని తిరుమలాపురం లోని అంగన్వాడీ కేంద్రం ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు పట్టిక ' ప్రకారం ఉన్నారా లేదా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వారి తో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. టీచర్, ఆయా లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...అంగన్వాడీ కేంద్రాల కోసం ప్రభుత్వం నిధులు పెంచాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు కేంద్రం లో అందించే పౌష్టికాహారం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులు కేంద్రాలలో ఉన్నంత సేపు 'ఇంటి వద్ద ఉన్న వాతావరణం కల్పించాలన్నారు..మెనూ ను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కేంద్రంలో చిన్నారుల ను చేర్పించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. పౌష్టికాహారం కలిగిన ఆహారం ను మాత్రమే అందించాలని సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడ కేంద్రంకు వచ్చి అందుతున్న పౌష్టికాహారం ను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్, ఆయా తదితరులు పాల్గొన్నారు.

### ఐటీసీ పిఎస్పిడి కాంట్రాక్ట్ కార్మికుల దీక్షకు భంగం

**సీఎం పర్యటన నేపథ్యంలో ఉద్రిక్తత**

**బూర్గంపహాడ్ మహా :** ఐటీసీ పిఎస్పిడి ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన దీక్షకు ముఖ్యమంత్రి పర్యటన కారణంగా భంగం కలుగుతున్నట్లు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీస్ శాఖ వారు దీక్ష శిబిరాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసి స్పష్టం చేసింది.ఇప్పటికే మూడో రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నిరసనలు మరింత ఉధృతమవుతున్నాయి. ఈ రోజు దీక్షలో జేఏసి కోకన్వీనర్ షేక్ యాకుబ్ పాషా, సభ్యులు పూణెం సురేంద్ర, సూరిశెట్టి జగదీష్, రామశెట్టిలక్ష్మీ, మేకల శేషమ్మ, దేగల రవి, పిల్లి ప్రభాకర్ రావు, ఆకిలి చంద్రరావు తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి మద్దతుగా ఐఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, ఐటీసీ ఐఎన్ టి యు సి నాయకులు, ఐటీసీ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు హాజరయ్యారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కోకన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్య, సభ్యులు కందాల వెంకట్ రెడ్డి, చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ డిమాండ్లు నెరవేరే వరకు దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## ఎలక్షన్ హామీ నెరవేర్చిన సర్పంచ్

**యువత కోసం గ్రౌండ్ అభివృద్ధి**

**బూర్గంపహాడ్ మహా :** ఇరవెండి గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు యువత కోసం క్రికెట్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేశారు. గ్రామంలో ఉన్న గ్రౌండ్‌ను పూర్తిగా శుభ్రపరిచి, ఆధునిక వైబ్రేటర్ యంత్రంతో సమతలీకరణ పనులు చేపట్టారు. తొలిసారిగా ఇలాంటి ఆధునిక పద్ధతులతో గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడం విశేషంగా నిలిచింది. ఈ చర్యల వల్ల యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుందని, గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీ కృష్ణతో పాటు యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సాపురంలో హైమస్ ఎల్ఈడి స్ట్రీట్ లైట్ ఏర్పాటు

**స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన సర్పంచ్**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో సింగరేణి వారి సౌజన్యంతో తెలంగాణ ప్రభుత్వం సెట్విన్ హైదరాబాద్, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో సిఎస్ఆర్ 2025 26 గ్రాంట్ తో 1,73,873 రూపాయల విలువ గల హైమస్ ఎల్ఈడి స్ట్రీట్ లైటును గ్రామంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం జరిగింది. బుధవారం గ్రామ కార్యదర్శి బి హారిక తో కలసి, గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి స్విచ్ ఆన్ చేసి, హైమస్ ఎల్ఈడి స్ట్రీట్ లైటును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ కుమారి మాట్లాడుతూ గ్రామానికి ఎల్ఈడి స్ట్రీట్ లైట్ ను మంజూరీ చేసి, అది ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసేందుకు సహకరించిన వైరా శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రామాలయం చైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి, పూనాటి మంజు, సంఘం చిన్నరాజు, వెలగా తిరుపతిరావు, తెల్లబోయిన మల్లికార్జున రావు, పుప్పాల శ్రీనివాసరావు, లేళ్ళ నవీన్ రెడ్డి, పదిమల అశోక్, మార్కాపురి రాంబాబు లైన్మెన్ రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురం ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్యాంప్



**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో బుధవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామపంచాయతీ సర్పంచ్ కనక రత్నం నరసాపురం జిల్లా పరిషత్ పాఠశాల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజీ చిన్నపిల్లలు ఎముకల కీళ్ల కంటి దంత సంబంధించిన జనరల్ స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో 70 మంది పాల్గొనగా 20 మందికి రక్త పరీక్ష నిర్వహించి 18 మందికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుభాష్, స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## చెరువు పూడిక తీత పనులు పరిశీలన

**గడువు లోపల నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించిన ఎంపీడీఓ**



**జూలూరుపాడు, మహా:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధి గుండెపుడి గ్రామ పంచాయతీలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను ఏపీఓ రామారావు తో కలిసి జూలూరుపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి బుధవారం పరిశీలించారు. పనుల ప్రగతిని సమీక్షించడంతో పాటు, కూలీల మాస్టర్ రోల్స్ ను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్న విషయాన్ని ఆయన ధ్రువీకరించారు. ఉపాధి హామీ కూలీలకు సరైన విధంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. నిర్దిష్ట గడువు లోపల నాణ్యతతో కూడిన పనులను పూర్తిచేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో రాజీకి తావు లేదు

- జిల్లా కలెక్టర్ అంకిత్
- మండలంలో ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ
- పాఠశాలలు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్..



**మహా దుమ్ముగూడెం:** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎటువంటి రాజీకి తావు లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. దుమ్ముగూడెం మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న ఆహారం, వసతి, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై సమగ్రంగా పరిశీలించారు. ముందుగా లక్ష్మీనగరం గ్రామపంచాయతీ పరిధిలోని కే రేగుబల్లి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు.కే రేగుబల్లి ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు స్థాయి, రాబోయే గణిత పరీక్షకు చేస్తున్న సంసిద్ధతగురించి అడిగి తెలుసుకున్నారు.స్టోర్‌రూమ్‌లో కూరగాయల నిల్వలను పరిశీలించిన కలెక్టర్, కేవలం క్యాబేజీ, ఆలుగడ్డ మాత్రమే ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఇవే వండుతున్నారా? క్యారెట్, బీట్రూట్ వంటి పోషకాహార కూరగాయలు ఎందుకు లేవు?" అని ప్రశ్నించారు. విద్యార్థులకు సమతుల్య పోషకాహారం అందించడం అత్యంత అవసరమని, ఒకే రకమైన ఆహారం ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు.దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆహార నాణ్యత లోపంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై అభిప్రాయాలను తెలుసుకుని, వడ్డిస్తున్న కూరలో టమాట, నీళ్లు, ఉప్పు, కారం తప్పించి ఇతర పదార్థాలు లేకపోవడాన్ని గమనించారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై సంబంధిత సిబ్బందిని మందలిస్తూ, ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, భోజన తయారీ, పంపిణీ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.దుమ్ముగూడెం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తనిఖీ సందర్భంగా, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఆహార నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు.పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేయాలని ఆదేశిస్తూ, వారం రోజుల్లో మళ్లీ తనిఖీ చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ పరిస్థితులు మెరుగుపడకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి విద్యార్థులకు ఉత్తమ సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ అశోక్ మండల ప్రత్యేక అధికారిని విజయలక్ష్మి ప్రధానోపాధ్యాయులు సావిత్రి, కోటేశ్వరమ్మ, శోభారాణి, బోధన,బోధ నేతర సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాలతో ప్రజలపై పన్నుల భారాలు



ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు సామాన్య ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తూ ఆర్థిక, సామాజిక సంక్షోభాలకు దారితీస్తున్నాయి. యుద్ధాల వల్ల ఆకలి అసమానతలు చావులు పెరుగుతున్నాయని మానవహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఆందోళనకారులు, సాహితీకారులు, రచయితలు, మేధావులు, కవి కళాకారులు ఆధ్వర్యంలో ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం నిలిపివేయాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ శాంతికి ముప్పు. యుద్ధాలు అధికార దాహంతో జరుగుతున్నప్పటికీ దాని భారం పేదలు, కార్మికులు, సామాన్య ప్రజలపై పడుతోంది. యుద్ధాల ప్రభావంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారి చమురు ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల ప్రజల జీవన వ్యయం అధికమవుతోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటూ నిరుద్యోగం పెరుగుతోంది. శరణార్థుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతూ మానవత్వానికి సవాళ్లు విసురుతున్నాయి. ఈ పరిస్థితుల్లో యువత, మేధావులు యుద్ధ వ్యతిరేక స్వరాన్ని బలంగా వినిపించాల్సిన అవసరం ఉంది. శాంతి, సహజీవనం, మానవ హక్కుల పరిరక్షణ కోసం సమాజం ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ప్రపంచ అరుదైన మేధావి కారల్ మార్క్స్ వివరించినట్లుగా అగ్ర దేశాలు తమ స్వలాభం కోసం యుద్ధాలను ఈ యుద్ధాలలో అమాయకులే సమాధులవుతారని మార్క్స్ ఆనాడే చెప్పాడు. పెట్టుబడిదారుల వికృతి చేష్టలకు పేదలే బలైపోతారని నిరుద్యోగం పెరిగి ఆకలి అసమానతలు పెంచుతారని దీనివల్ల శాంతికి భంగం కలుగుతుందని మార్క్స్ నొక్కి చెప్పారు. మార్క్స్ రాసిన గ్రంథాల వల్ల నేడు అమెరికాలో ఎక్కువగా పుస్తకాలు అమ్ముడుపోయాయి. 200 సంవత్సరాల క్రితం ప్రపంచం ఎలా ఉంటుందో మార్క్స్ తన రచనల ద్వారా భవిష్యత్ తరాలకు తెలియపరిచాడు. అగ్రదేశాలలో సంక్షోభం వచ్చినప్పుడల్లా మార్క్స్ రచించిన గ్రంథాలు వెతుకుతారు భవిష్యత్ తరాలకు కూడా మార్క్స్ కాలజ్ఞాని అని చెప్పవచ్చు.

అమెరికా దేశం ఇరాన్ దేశంపై దాడి ఎవరి కోసమనేది అర్థమవుతుంది. ఏకపక్షంగా యుద్ధం చేయడంతో మూడు వేలకు మందిపైగా చనిపోయారు. చిన్నారులు 1000 పైగా ఉంటారని ఒక అంచనా. తిండి లేక ఆకలితో అలమటిస్తూ దాహార్తిని తీర్చలేక నీరు దొరకక యుద్ధ బాధితులు క్షణం క్షణం నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ప్రమాదం పొంచి ఉంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ లో మాట్లాడుతూ కరోనా టైంలో ఏ విధంగానైతే ఐక్యంగా ఉన్నామో ఇప్పుడు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పశ్చిమాసియా యుద్ధం సంక్షోభాన్ని సృష్టిస్తుందని ఇంధనం ఎరువులు జాతీయ భద్రత రంగాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ నేతలందరితో మాట్లాడి ఉద్రిక్తతలను తగ్గించాలన్నారు. యుద్ధానికి మాత్రం ఐదు రోజులు బ్రేక్ ఇస్తున్నట్లు ఇరాన్ పై దాడులు జరుపబోమని, చర్చలు సానుకూలంగా జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. మేము అమెరికాతో చర్చలు జరుపబోమని ఇది ట్రంపు కుట్ర అని ఇరాన్ ఆరోపించింది ఇరాన్ లోని విద్యుత్ ప్లాంట్లు టార్గెట్ గా దాడులు చేస్తామని అమెరికా హెచ్చరించింది. అతిపెద్ద విద్యుత్ ప్లాంట్ తోనే తమ దాడులు మొదలు పెడతామని హెచ్చరించి 24 గంటలు గడవక ముందే ట్రంప్ మాట మార్చేశారు. ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే గల్ఫ్ ప్రాంతంలోని అన్ని దేశాల ఇంధన వనరులను లక్ష్యంగా చేసుకుంటామని గట్టి హెచ్చరికే ట్రంపు లొంగిపోయారని ఇరాన్ రాయబార ప్రధాన కార్యాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ట్రంప్ డెడ్ లైన్ తో ఇరాన్ లో దాడులు జరిగితే పరిషియాన్ గల్ఫ్ అంతటా సముద్రం మందు పాతరలను మోహరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. సౌదీ అరేబియా యూఏఈ, ఖతార్, కువైట్ లో విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని రికాల్ జారీ చేశారు. అయితే అమెరికా రాజీ కుదిరించేందుకు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు తుర్కియే ఈజిప్ట్ పాకిస్తాన్ దేశాలు ముందుకొచ్చాయి. ఇరాన్ అమెరికా రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ యుద్ధం ఆపేందుకు చర్చలు జరిగాయి. ఇరాన్ మతాచార్యుడు అలీ ఖమేనీ ని హత మార్చడంతో అమెరికా ఇజ్రాయిల్ దేశాలు గత 23 రోజులుగా నరమేధానికి పాల్పడ్డారు. పసిపిల్లలు చదువుకుంటున్న పాఠశాలలపై బాంబులు వేయడంతో 175 మంది ప్రాణాలు తీయడంతో పాటు విద్యా ధ్వంసాన్ని సృష్టించారు. లక్షల జనావాసాలు దంసమయ్యాయి. 2003 ఇరాక్ లో జార్జిబుష్, 2011లో లిబియా సిరియా లో ఒబామా తలలు బొప్పి కట్టించుకున్నారు. పశ్చిమాసియా దేశాలలో పెత్తందారుగా ఎదగాలన్నది ఇజ్రాయిల్ కల. 1812 లో వెళ్లిన నెపోలియన్ అక్కడి భౌగోళిక అపరిచితులపై అంచనా లేకపోవడంతో ఆరు లక్షల మంది సైన్యాన్ని కోల్పోయాడు. అతడి పతనానికి నాంది అయ్యింది. ఇరాన్ ను నాశనం చేసి క్యూబాను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటామంటున్న ట్రంపు అహంకారపూరితమైన ప్రకటనలు నిజమైతే ప్రపంచ భావనలకు ఇది గొడ్డలిపెట్టు అవుతుంది.

చైనా, రష్యా అమెరికా ఆధిపత్యానికి ఎదురు నిలవకపోతే మిత్రదేశాలను రక్షించలేరనే సంకేతాలు వెళుతున్నాయి. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోనూ వర్ధమాన రాజ్యాలకు చేరవేస్తుంది. ప్రస్తుతం క్యూబా ఆర్థికంగా చితికిపోయింది. ఆరోగ్య సంక్షోభంలో చిక్కుకొని ఆకలితో అల్లాడుతుంది. క్యూబా సోషలిస్టు వ్యవస్థను నిర్మూలిస్తామని అమెరికా అధ్యక్షుడు బాహటంగానే చెబుతున్నాడు. కరోనా సమయంలో క్యూబా దేశం డాక్టర్లు ప్రపంచానికే ఉచితంగా వైద్య సేవలను అందించారు. వెనిజులా దేశ అధ్యక్షుడు మధురో దంపతులపై అమెరికా దాడి చేసి వారిని కిడ్నాప్ చేసింది. ఇజ్రాయిల్ అమెరికా ఇరాన్ పై దాడికి ముందు గాజాపై ఊచకోత కు పాల్పడ్డారు. ఇరాన్ పై యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పై వస్తున్న విమర్శల నుంచి వాటి నుండి బయట పడేందుకు తహతహలాడుతున్నాడు. ఇజ్రాయిల్ ఇరాన్ పై రెండుసార్లు దాడులు చేయడంతో జనావాసాలన్నీ అగ్నికి ఆహుతై కాలి బూడిదయ్యాయి. దక్షిణ లేబానాన్ లోని కొన్ని ప్రాంతాలు పెద్ద ఎత్తున అగ్నిలో దగ్ధమైపోయాయి. బయట నుండి సహాయం అందకుండా ఆంక్షలు విధించింది. ఇరాన్ పై అమెరికా దాడుల్లో ఇరాన్ దేశ కీలక నేతలతో పాటు వేలాదిమంది చనిపోయారు. అమానవీయమైన సంఘటన అంటే ఇరాన్ పాఠశాలల పై అమెరికా దాడి జరపడం వల్ల పాఠశాల విద్యార్థులు 160 మంది చనిపోయారు. ఇందులో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. సోవియట్ యూనియన్ సహాయంతో నిర్మితమైన క్యూబా విద్యుత్ సరఫరా చమురు దిగుమతుల్లో కుప్పకూలిపోతోంది. దీంతో ఆస్పత్రులు,




- దామరపల్లి నర్సింహారెడ్డి,
95813 58696

పాఠశాలలు, పరిశ్రమలు ప్రతిచోట దట్టమైన చీకట్లు అలుముకుంటున్నాయి. విద్యుత్ కొరతతో మంచినీటి సరఫరా, వ్యవసాయం, ప్రజా రవాణా రంగాలు పడకేస్తున్నాయి. ఆదాయాలు కరిగిపోయి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. యుద్ధ సంక్షోభంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. భారత దేశంతో పాటు పలు దేశాలకు పదే పదే ఆటంకాన్ని కలిగిస్తుంది.

అమెరికన్ గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువులు ధరలు ఆమాంతంగా పెంచేశారు. క్యూబాలో సామాన్య, మధ్యతరగతి, పేద ప్రజలు బతుకులు ఛిద్రమవుతున్నాయి. అమెరికా దాహానికి అటు ఇరాన్ ఇటు క్యూబా దేశాలు వల్ల కాదయ్యాయి. రెండు దేశాల మధ్య యుద్ధాలు జరిగితే ఆ ప్రభావం ప్రపంచంపై పడుతుంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం భారత్ పై పడింది. భారతదేశంలో చేనేత రంగం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం అలా రంగాలు కుదేలవుతున్నాయి. తెలంగాణలో చేనేత రంగం ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. ధరలు పెరుగుదలతో చేనేత రంగం మరింత ప్రమాదంలోకి నెట్టివేయబడింది. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు కిలోమీటర్ల పొడవున క్యూ లైన్ కడుతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. రవాణా వ్యవస్థ మరింత భారం కానుంది. యుద్ధం వద్దు శాంతి ముద్దు అనే నినాదం ప్రపంచ నినాదమై ధ్వనిస్తుంది. యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం శాంతిని ప్రేమించుదాం.

# ఇంధన లాక్ డౌన్ భయాలు




ప్రపంచం మళ్ళీ కాలచక్రంలో వెనక్కి వెళ్తోందా? ఆరేళ్ల క్రితం కంటికి కనిపించని కరోనా వైరస్ సృష్టించిన భీభత్సం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మానవాళికి, పశ్చిమాసియా రణభూమిలో ఎగిసిపడుతున్న మంటలు కొత్త సవాలును విసురుతున్నాయి. నాడు ప్రాణాలను కాపాడుకోవడానికి ఇళ్లకే పరిమితమైన జనం, నేడు తమ వాహనాలను నడిపేందుకు ఇంధనం దొరకక అనివార్యంగా 'లాక్‌డౌన్' దిశగా అడుగులు వేయాల్సిన దుస్థితి కనిపిస్తోంది. యుద్ధం ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్నా, దాని సెగ మాత్రం సామాన్యుడి వంటగది నుంచి భాగ్యనగర రహదారుల వరకు ప్రతిచోటా స్పష్టంగా తగులుతోంది. అమెరికా తాత్కాలిక విరామం ప్రకటించినా, ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య కొనసాగుతున్న భీకర దాడులు అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయి*

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు అంతర్జాతీయ సరిహద్దులు దాటి భారత గడ్డపై కూడా తన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యుద్ధ ప్రభావం స్వల్పకాలికం కాదని, సుదీర్ఘ కాలం పాటు ఆర్థిక వ్యవస్థపై భారం పడే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. ముఖ్యంగా కరోనా సంక్షోభ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగానైతే సమన్వయంతో పనిచేశాయో, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ఈ విపత్తు నుంచి బయటపడాలని ఆయన కోరారు. వలస కార్మికుల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు సూచించడం భవిష్యత్తులో రాబోయే క్లిష్ట పరిస్థితులకు అద్దం పడుతోంది.

యుద్ధ ప్రభావం క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఇంధన కొరత రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా భాగ్యనగరం హైదరాబాద్‌లో పెట్రోల్ బంకులన్నీ మూతపడటం సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవ్వడంతో దేశీయంగా నిల్వలు తగ్గిపోతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సంక్షోభం కేవలం రవాణా రంగానికే పరిమితం కాకుండా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న ఈ పరిస్థితులు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో కేవలం పది రోజులకు సరిపడా వ్యూహాత్మక చమురు నిల్వలు మాత్రమే ఉన్నాయని వెల్లడైన వాస్తవాలు పరిస్థితి తీవ్రతను చాటుతున్నాయి.

ఒకవేళ ఇంధన కొరత కారణంగా లాక్‌డౌన్ విధిస్తే, అది కోవిడ్ కాలం నాటి ఆంక్షల కంటే భిన్నంగా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. వాహనాల వినియోగంపై కఠిన పరిమితులు విధించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని మళ్ళీ తప్పనిసరి చేయడం, విద్యాసంస్థలకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాల్సి రావచ్చు. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ట్రావెల్ ఏజెన్సీలు, పరిశ్రమలు తమ కార్యకలాపాలను తగ్గించుకుంటున్నాయి. ఈ గండం నుంచి గట్టెక్కాలంటే అంతర్జాతీయంగా శాంతి చర్చలు సఫలం కావడమే ఏకైక మార్గం. అప్పటివరకు అనవసర ప్రయాణాలను తగ్గించుకుని, ఇంధనాన్ని పొదుపుగా వాడుకుంటూ ప్రభుత్వాలకు సహకరించడమే పౌరుల ముందున్న కర్తవ్యం.

అంతర్జాతీయ ఆధిపత్య పోరులో సామాన్యుడు బలిపశువు కాకుండా చూడటమే ఇప్పుడు పాలకుల ముందున్న అతిపెద్ద సవాలు. రేపు జరగబోయే అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వ్యూహాలను ఖరారు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని ఈ తరుణంలో, ప్రతి ఇంటిలోనూ భవిష్యత్తుపై ఒక రకమైన అనిశ్చితి నెలకొంది. చమురు నిల్వలపై పారదర్శకతను పెంచుతూ, వదంతులు వ్యాప్తి కాకుండా చూడటమే ప్రస్తుత అత్యవసర చర్య. లోకం మరోసారి స్తంభించకుండా ఉండాలంటే, అది కేవలం ఆయుధాల మౌనం వల్లనే సాధ్యమవుతుంది.

- గడల నరసింహారావు, ఖమ్మం

# ప్యాలెస్ ఆన్ వీల్స్ లోపలి దృశ్యాలు
# చూస్తే ఫిదా అవ్వాల్సిందే...

సాధారణంగా భారతీయ రైళ్లలో ప్రయాణించేటప్పుడు బాత్‌రూమ్‌ల పరిస్థితిని తలుచుకుంటేనే చాలామందికి నీరసం వస్తుంది. అపరిశుభ్రత, దుర్వాసన వంటి ఫిర్యాదులు తరచూ వినిపిస్తుంటాయి. కానీ, భారత దేశపు అత్యంత విలాసవంతమైన రైలు 'ప్యాలెస్ ఆన్ వీల్స్')లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడి బాత్‌రూమ్‌లను చూస్తే మీరు ఏదైనా విదేశీ ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉన్నామా? అనే అనుమానం కలగక మానదు.



### వైరల్ అవుతున్న లగ్జరీ వాష్‌రూమ్ వీడియో

ప్యాలెస్ ఆన్ వీల్స్ సేల్స్ డైరెక్టర్ భవానీ సింగ్ ఫిబ్రవరి 24న ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ఈ వీడియోలో రైలులోని ప్రీమియం వాష్‌రూమ్ దృశ్యాలు నెటిజన్లను ఆశ్చర్యపరుస్తున్నాయి. రైలులో ఇంతటి అత్యాధునిక వసతులు ఉంటాయా అని అంతా నోరెళ్లబెడుతున్నారు.

### అందులో ఏముంది?

ఈ విలాసవంతమైన వాష్‌రూమ్‌లో తెల్లటి మెరిసిపోయే రెక్టాంగిల్ బాత్‌టబ్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కిటికీ పక్కనే ఏర్పాటు చేసిన ఈ బాత్‌టబ్‌లో సేదతీరుతూ బయటి ప్రకృతిని ఆస్వాదించవచ్చు. అంతేకాకుండా, వెండి అంచులతో కూడిన అందమైన అద్దం, ఆధునిక వాష్ బేసిన్, టాయిలెట్ సామాగ్రిని ఉంచుకోవడానికి చెక్కతో చేసిన ప్లాట్‌ఫారమ్ వంటివి దీనికి మరింత రాయల్ లుక్ ఇస్తున్నాయి. హ్యాండ్‌వాష్, మెత్తటి టవల్స్, క్లీన్ కమోడ్ ఇలా ప్రతి చిన్న విషయాన్ని ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దారు.

### రాజసం ఉట్టిపడే ప్రయాణం: ప్యాలెస్ ఆన్ వీల్స్ ప్రత్యేకతలు

రాజస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, భారతీయ రైల్వేలు సంయుక్తంగా 1982లో ఈ రైలును ప్రారంభించాయి. ఇది కేవలం ప్రయాణం మాత్రమే కాదు, ఎనిమిది రోజుల పాటు సాగే ఒక అద్భుతమైన అనుభూతి.

### రాయల్ డైనింగ్

ఈ రైలులో 'ది మహారాజా', 'ది మహారాణి' అనే రెండు మిచెలిన్ స్టార్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక్కడ ఇండియన్, రాజస్థానీ వంటకాలతో పాటు కాంటినెంటల్ రుచులను కూడా ఆస్వాదించవచ్చు.

### అత్యాధునిక వసతులు


ప్రతి క్యాబిన్‌లో వైఫై, శాటిలైట్ టీవీ, వ్యక్తిగత సహాయకులు అందుబాటులో ఉంటారు. ప్రయాణికుల కోసం ఒక విలాసవంతమైన బార్, లాంజ్, ఆయుర్వేదిక్ స్పా సెంటర్ కూడా ఉన్నాయి.

### సందర్శించే ప్రాంతాలు

న్యూఢిల్లీ నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రయాణం జైపూర్ (పింక్ సిటీ), జైసల్మేర్ (గోల్డెన్ సిటీ), జోధ్‌పూర్ (బ్లూ సిటీ), ఉదయ్‌పూర్ (సిటీ ఆఫ్ లేక్స్) మీదుగా సాగుతుంది. అలాగే రణథంబోర్ నేషనల్ పార్క్, భరత్‌పూర్ పక్షుల సంరక్షణ కేంద్రం, ప్రపంచ ప్రసిద్ధ ఆగ్రా కోట, తాజ్ మహల్‌లను కూడా సందర్శించవచ్చు.

సెప్టెంబర్ నుండి ఏప్రిల్ వరకు నడిచే ఈ రైలు, విదేశీ పర్యాటకులతో పాటు విలాసవంతమైన ప్రయాణాన్ని కోరుకునే భారతీయులకు కూడా మొదటి ప్రాధాన్యతగా నిలుస్తోంది.





## కమ్యూనిస్టుగా జీవితం త్యాగానికి నిదర్శనం

### బాధిత కుటుంబాలకు సీపీఐ(ఎం) నేతల పరామర్శ



**కారేపల్లి, మహా :** కమ్యూనిస్టుగా జీవించటం సేవాత్యాగనిరతికి నిదర్శనమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కారేపల్లి మండలం జైత్రాంతండా, తవిసిబోడు, పాటిమీదిగుంపు, విశ్వనాథపల్లి గ్రామాల్లో మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ(ఎం) కుటుంబాలను నున్నా నాగేశ్వరరావు పరామర్శించారు. జైత్రాంతండా లో ఇటీవల మృతి చెందిన సీపీఐ(ఎం) నేత పిప్పల కృష్ణ సతీమణి సుభద్ర సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఆయన సుభద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. కుటుంబాన్ని ఓదార్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భర్త పిప్పల కృష్ణ నాయకుడిగా పోరాటాలలో ముందుండగా ఆయనకు వెన్నదన్నుగా సుభద్ర నిలిచి ప్రోత్సహించారన్నారు. పోడు, కూలీ, మహిళ చైతన్య కార్యక్రమాలలో సుభద్ర పాల్గొని ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజలను చైతన్యం చేయటం కమ్యూనిస్టుల కర్తవ్యమన్నారు. ప్రపంచంలో జరుగుతున్న పరిణమాలకు అమెరికా అధిపత్య ధోరణే కారణమన్నారు. సామ్రాజ్యవాద విధానంతో చిన్న దేశాలపై పెత్తనం సాగించి అక్కడి వనరులను దోచుకోవటమే అమెరికాపనిగా పెట్టుకుందన్నారు. అలీన విధానంతో తటస్థ దేశం పేరున్న భారత్‌దేశంను అమెరికాకు సాగిలపడేలా ప్రధాని మోడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంను ఏలుతున్న కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుంటుందన్నారు. సమాజంలోని పరిస్థితులను ప్రజలకు వివరించి పోరాటాలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తవిసిబోడులో ఇటీవల మరణించిన రేమళ్ల బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పాటిమీదిగుంపులో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, సూరబాక ధనమ్మ, నాయకులు గుగులోత్ మోత లు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. విశ్వనాధపల్లిలో సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ వద్దే అజయ్‌బాబు పరామర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, వైరా డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మండల నాయకులు మన్నెం బ్రహ్మయ్య, రేమళ్ల వీరస్వామి, బానోత్ కిషన్, రేమళ్ల బాబు, నూనావత్ వెంకన్న, రవి, ధరావత్ విజయ, పిప్పల కృష్ణ, పిప్పల రణదీవే, సురభాక సరవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై యుద్ధం ఆపాలి

### అఖిలపక్షాల డిమాండ్..



**మణుగూరు, మహా :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, యుద్ధాన్ని కారణంగా చూపుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో మణుగూరులోని స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయిల్ నిక్షేపాలపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రపంచ దేశాలపై దాడులు, యుద్ధాలు చేస్తూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తూ ప్రపంచ పోలీస్‌లా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జీవ రసాయనాల పేరుతో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను ఉరి తీయించిందని, ఇతర దేశాలపై కూడా దౌర్జన్యాలకు పాల్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం కొనసాగిస్తూ ఆ దేశ ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపై పడే ప్రమాదం ఉందని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగి భారత ప్రజలు కూడా ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల యుద్ధాలను వ్యతిరేకించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పిలుపునిచ్చారు.యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 29న ప్రెస్ మీట్ నిర్వహించాలని, ఏప్రిల్ 4న శాంతి ర్యాలీ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ర్యాలీని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్ మధుసూదన్ రెడ్డి, పీ నవీన్, కాంగ్రెస్‌కు చెందిన జీవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీకి చెందిన ఏ చంద్రారెడ్డి, బిజెపికి చెందిన పున్నం బిక్షపతి, సిపిఐకు చెందిన గడ్డం వెంకటేశ్వర్లు, టిడిపికి చెందిన పూర్ణచందర్ రావు, ఎంసిపిఐకి చెందిన మోహన్ రావు, ఐఎఫ్‌టియు ఎస్.డి నాజర్ పాషా, టీయూసిఐకి చెందిన మల్లెల రామయ్య, పీఓడబ్ల్యూకి చెందిన ఆదిలక్ష్మి, రైతు కూలీ సంఘం జగ్గన్న, ముస్లిం మిల్లత్ కమిటీకి చెందిన ఎండీ రఫీ, మహిళా సంఘాల నాయకులు ప్రమీల, లక్ష్మీ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతకాలను సాధించిన మహిళా కానిస్టేబుల్

### సుష్మను అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిసున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ డి.సుష్మ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెం విభాగాలలో బంగారు పతకాలను సాధించారు. విశేష ప్రతిభ కనబరచి పంజాబ్ లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఐదవ స్థానంలో నిలిచిన సుష్మను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రామనవమి పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు

### ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈ నెల 27వ తారీకున భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, మిథిలా స్టేడియంలో జరగనున్న రామనవమి మరుసటి రోజు జరగనున్న పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. సెక్టార్ల వారీగా ఇన్చార్జ్ అధికారులు తమ క్రింది స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసారు. సుమారుగా 2000 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలియజేసారు. భక్తుల కొరకు పార్కింగ్ స్థలాలు, లడ్డూ కౌంటర్లు, సెక్టార్ల వివరాలను తెలియజేస్తూ జిల్లా పోలీసుల తరపున ప్రత్యేకంగా ఒక QR కోడ్ ను, అదేవిదంగా ఆన్లైన్ లింకు (https://ramanavami.4sightai.com/) ను రూపొందించడం జరిగిందని తెలిపారు. కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి.. రూ.10 వేల విలువైన బియ్యం, నిత్యావసరాల వితరణ



**మణుగూరు/అశ్వాపురం, మహా :** మణుగూరు ఏరియా సింగరేణి కార్మికుడు మడ్డి రాము కుమార్తె జోషిక జన్మదిన వేడుకలు సేవామయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం అశ్వాపురంలోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో చిన్నారి పుట్టినరోజును ఘనంగా జరుపుతూ వృద్ధులకు ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకే ఓసి2లో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మడ్డి రాము, దివ్య దంపతులు తమ కుమార్తె జోషిక జన్మదినం సందర్భంగా సుమారు రూ.10 వేల విలువైన క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులను వృద్ధాశ్రమానికి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారికి వృద్ధాశ్రమ నిర్వాహకులు, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యుడు ఎస్.డి. నాజర్ పాషా మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వహణ వ్యయప్రయాసలతో కూడుకున్నదని, దాతల సహకారంతో విజయవంతంగా నడిపిస్తున్న షేక్ షహనాజ్, మేహరాజ్ దంపతులను అభినందించారు. వేసవి కాలంలో వృద్ధులు తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగి షేక్ గఫూర్, బంధువులు ఎం. సత్యం, సాంబ లక్ష్మి, వృద్ధాశ్రమ నిర్వాహకులు షేక్ షహనాజ్, మేహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి విద్యా కోర్సులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జి.యం.ఆర్. వరలక్ష్మి సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ లైవ్లీహుడ్స్ సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ అందించనున్నట్లు కొత్తగూడెం ఏరియా జి.యం ఎం.శాలేం రాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరమని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రముఖ కంపెనీల సహకారంతో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఉచిత వసతి భోజన సదుపాయం కల్పించబడుతుందని చెప్పారు. నిపుణుల ద్వారా సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ స్పోకెన్ ఇంగ్లీష్ బేసిక్ కంప్యూటర్ శిక్షణ అందించబడుతుంది. శిక్షణ పూర్తిచేసిన వారికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. అదనంగా ఉద్యోగ అవకాశాల కల్పనలో కూడా సహకారం అందించబడుతుంది. అర్హత 18 నుండి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు ఉండాలన్నారు.

**శిక్షణా కోర్సులు..**

డ్రైవాల్ అండ్ ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్ వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్ ఆటోమొబైల్ టూ వీలర్ టెక్నీషియన్ గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (హోటల్ మేనేజ్ మెంట్)ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండీషనింగ్ (ఆర్ఏసీ) టెక్నీషియన్ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ టెక్నీషియన్ ఎక్స్కవేటర్ ఆపరేటర్ ఉన్నాయి.ఈ కోర్సుల్లో చేరదలచిన అభ్యర్థులు కొత్తగూడెం ఏరియా సింగరేణి వి.టి.సి వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు ఎస్.ఓ టు జి.యం ఎం.వెంకటేశ్వర రావు, కోటి రెడ్డి, ఏజీఎం పర్సనల్ జి.వి.మోహన్‌రావు, జి.ఎం.ఆర్ సంస్థ ప్రతినిధులు ఇతరులు పాల్గొన్నారు.

## కలహాలు మాని కలిసి జీవించాలి

### జమాతే ఇస్లామి హింద్ షేఖ్ అబ్దుల్ బాసిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే అని మనమంతా పరస్పరం సోదరులమని అందరం కలిసి ఒకరి సుఖదుఃఖాలను మరోకరు పంచుకుంటూ జీవించాలని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్ రామవరం శాఖ కొత్తగూడెం కార్పోరేషన్ సుభాష్ చంద్రబోస్ నగర్ 14వ వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన "ఈద్ మిలాఫ్" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషి స్వార్థం స్వలాభాన్ని వీడి కల్మషం లేని మనసుతో సమాజంలో జీవించాలని పిలుపునిచ్చారు. అందరూ బాగుండాలి అందులో నేను ఉండాలని భావించినప్పుడే సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని అన్నారు. సిపిఐ సభ్యులు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ మతాలన్నీ మంచినే బోధిస్తాయని వారి వారి మత విశ్వాసాలు పాటిస్తూ ఇతరుల మత విశ్వాసాలను కూడా గౌరవించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ కూరపాటి సుధాకర్ రాజు మాట్లాడుతూ ఒకరి పండుగలను మరోకరు గౌరవించుకుంటూ కలిసి మెలిసి జీవించాలని కులమతాలకు అతీతంగా ఇలాంటి "ఈద్ మిలాఫ్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జమాతే ఇస్లామి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ సూఫర్ మార్కెట్ అధినేత నారాయణ, తోట శీను, వెల్డింగ్ షాప్ నారాయణ రాజు, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు రబ్బాని, మసీద్ అధ్యక్షుడు జైనులాబుద్దీన్, సెక్రటరీ మస్తాన్, శీరిషా, ఆరాధ్య, క్రిసోలైట్, జమాత్ సభ్యులు షమీం, రహ్మతుల్లాహ్ హుస్సేనీ, అజ్మత్, ఇర్ఫాన్, యం.పి.జే అధ్యక్షుడు మన్నాన్, సాయి వెంకట్, ఆలం అధిక సంఖ్యలో స్త్రీ పురుషులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలి

### సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాసరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం కొత్తగూడెం భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ కు వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్ ఎంతో కలిసి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రోడ్డు నుండి కలియుగ దైవంగా పేరుగాంచిన తిరుపతికి షిరిడికి ప్రత్యేక రైలు నడపాలని కోరారు. మణుగూరు టు డోర్నకల్ ప్యాసింజర్ బెల్గాబి ఎక్స్ప్రెస్ రైళ్లను తిరిగి తక్షణమే నడిపించాలని తెలిపారు. జిల్లాకు కేంద్రమైన కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. గతంలో రద్దు చేసిన కాజీపేట డోర్నకల్ టు మణుగూరు ప్యాసింజర్ బెల్గావి ఎక్స్ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించి ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయని దీని ద్వారా ప్రజలకు ప్రయాణికులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని తక్షణమే కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తి చేసి ప్రజలకు ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి సమస్యలపై వినతి పత్రం అందించారు. సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్ఎం. గోపాలకృష్ణయ్య, ఏఆర్ఎం సిఫాలితోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారుల బృందం కొత్తగూడెం రైల్వే స్టేషన్ రైల్వే అభివృద్ధి పనులతో పాటు శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు, రైల్వే సమస్యలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ప్రణాళికలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వే డివిజన్ ఏ ఆర్ ఎం సిపాలి, రైల్వే ఏరియా ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, ఏరియా రైల్వే ఇన్స్పెక్టర్ పాషా, రైల్వే స్టేషన్ మేనేజర్ విశ్వనాథ్, రైల్వే సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్సై సాయి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలి

### రైల్వే డీఎంకు సర్పంచ్ టోని వినతి



**కారేపల్లి, మహా :** డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్ వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్నరైల్వే డబ్లింగ్ ట్రాక్‌కోసం రైతుల నుండి భూమిని సేకరించారని వారికి మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ) రైల్వే డీఆరఎంను కోరారు. దీనికి సంబంధించి ఆయన డీఆరఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డబ్లింగ్ ట్రాక్ నాన్ ఏజన్సీ ప్రాంతమైన సింగరేణి రెవిన్యూ నుండి వెళ్తుందని, సింగరేణిలో భూమి మార్కెట్ రేట్లు అధికంగా ఉన్నాయన్నారు. పట్టణాలతో సమానంతో సాగుభూమి, ఇండ్ల స్థలాలు, ఇండ్లు రేట్లు ఉన్నాయని రైల్వే ట్రాక్‌తో నిర్వాసితు□వుతున్న వారు మరో చోట స్థలాలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. సింగరేణి గ్రామ పరిధిలో 80 మంది రైతులకు ప్రభుత్వ రేటు ప్రకారం పరిహారం ఇస్తామని అధికారులు తెల్పటం తగదన్నారు. సాగు భూమి ఎకరాకు రూ.90 లక్షలు, ఇండ్ల స్థలాలు గజం కు రూ.20వేలు ఇప్పించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. కారేపల్లి క్యాబిన్ సమీపంలో 70 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే గేట్ ను మూసి వేసి నిర్ణయాన్ని విరమించుకోవాలని రైల్వే అధికారులను కోరారు. రైల్వే క్యాబిన్ రైల్వే గేట్ ద్వారా 300 మంది రైతులు పొలాలకు వెళ్తున్నారని గేట్ మూసివేస్తే రైతుల రాకపోకలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రైల్వే గేట్ ను అదే స్థానంలో ఉంచాలని వినతిలో కోరారు.

**కారేపల్లిలో ఆగని డీఆర్వో**

దక్షిణమధ్య రైల్వే డీఆర్వో బుధవారం భద్రాచలం రోడ్ వైపు వెళ్తూ కారేపల్లి జంక్షన్ రైల్వే స్టేషన్ పరిశీలిస్తారని ఆశించిన గ్రామస్తులకు డీఆర్వో కారేపల్లిలో ఆగకుండానే వెళ్లారు. రైల్వే ట్రాక్ నిర్వాసిత సమస్యలను వివరించాలని, వినతి పత్రం ఇవ్వాలని ఆకాంక్షించినసర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) డీఆర్వో కారేపల్లి స్టేషన్ దిగకుండా రైల్వే బోగిలో ఉండటంతో వినతిపత్రాన్ని చూపుతూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## అభివృద్ధి పేరుతో అక్రమ మట్టిదందా



### అడ్డుకున్న గుట్టకిందిగుంపు గ్రామస్తులు

**కారేపల్లి, మహా :** ఎఫ్‌సీఐ గోదాం నిర్మాణ పనులు చేజిక్కించుకున్న గుత్తేదారు అభివ□ద్ధి పేరుతో అక్రమ మట్టిదందా సాగిస్తున్నారని గుట్టకిందిగుంపు సర్పంచ్ ఉండం రాఘవులు, గ్రామస్తులు ఆరోపించారు. గుట్టకిందిగుంపు గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టపై గోదాం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయటంతో పనులకు టెండర్ దక్కించుకున్న గుత్తేదారు అక్కడి మట్టిని రాత్రి, పగలు టిప్పర్లతో తరలించి అమ్మకాలు సాగిస్తున్నారని దీంతో పర్యావరణ దెబ్బతినటం, చుట్టుపక్కల పంటలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకోని ఆందోళన చేపట్టారు. గోదాం ప్రాంతానికి అనుకోని ఉన్న ఫారెస్టు భూమిలో సైతం తవ్వసాగిస్తున్నారని ఫారెస్టు అధికారుల హెచ్చరికలతో దానిని ఆపారన్నారు. ఆవేదన వ్యక్త చేశారు. గోదాం పనులు చేయాల్సిన గుత్తేదారు ఆ పనులు ప్రారంభించకుండా మట్టి అమ్మకాలు సాగిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారన్నారు. బహిరంగంగా మట్టితరలిస్తున్నా అధికారులకు తెలిసిన పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి అక్రమ తవ్వకాలను అపకపోతే పెద్దఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు ఈసం లక్ష్మీనర్సు, ఉండం నవీన్, చేల అంజయ్య, ఈసం పాపయ్య, ఈసం సుధాకర్, కోటయ్య, రమేష్, సోమయ్య, కుంజ రాములు, సంజీవరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఘనంగా కిడ్స్ ఫెస్ట్ వేడుకలు



**చర్ల మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వ్యవస్థాపకులు డా. డి.ఎన్. కుమార్ మరియు డా. ప్రతిభ గార్ల కుమారుడు, స్వర్గీయ రాహుల్ గారి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం రాహుల్ విద్యాలయ ప్రాంగణంలోని కళాభవన్ లో 'కిడ్స్ ఫెస్ట్' వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు... పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్మ రాజు గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవనీయులు ఎస్.ఐ. నర్సిరెడ్డి గారు మరియు మండల విద్యాశాఖ అధికారి (MEO) పరిటాల వెంకట రమణ గారు విచ్చేశారు. ముందుగా స్వర్గీయ రాహుల్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంలో ఇలాంటి కిడ్స్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, చదువుతో పాటు కళలు, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని. పిలుపునిచ్చారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని రాహుల్ చిన్నారుల చేత దృశ్య కావ్యంగా చూపించటం జరిగింది. ఈ దృశ్య కావ్యాన్ని అద్భుతంగా అభినయించిన చిన్నారులు పలువురు నుండి ప్రశంసలు అందుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గత 25 సంవత్సరాలు గా విద్యారంగం లో సేవలు అందిస్తున్న . డి.ఎన్. కుమార్ మరియు డా. ప్రతిభ గార్లను కార్యక్రమానికి విచ్చేసిన పలువురు అభినందనలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ప్రముఖులు చింతూరి వెంకటరావు,SK.షాజహాన్, గుమ్మడి భారతి, కౌసరాజు శిరీష, హరి చరణ్, పాత్రికేయులు , ఉపాధ్యాయులు ఎం.వి.ఎల్. నరసింహ రావు, గురజాల రామారావు, బోసు బాబు, క్రాంతి కుమార్, ఉస్మాన్, సునీత, శ్రీధర్ బాబు, ఆనంద్సునీత, రమ , జ్యోతి ,చైతన్య,ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు మీసాల మాధురి , లావణ్య , మౌనిక ,శిరీష గారితో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్రెయిన్ ఫీవర్ వ్యాధి బాధ్యత విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గంప సాయి శ్రావణ్ కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ ఫీవర్ వ్యాధితో బాధపడుతూ కోమాలోకి వెళ్ళాడు. ప్రస్తుతం శ్రవణ్ కుమార్ ఖమ్మం పట్టణంలోని మమత మల్టీస్పెషల్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి శ్రావణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని పాఠశాల ఉపాధ్యాయులు బాధ్యత కుటుంబానికి 15 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్య అధికారి నక్క రాజేశ్వరరావు చేతుల మీదుగా బాధ్యత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమాకుమారి, సుదర్శనమ్మ, రమాదేవి, థెరిస్సా, మురళి, జహీర్ పాషా, మాధవరావు, సుజాత, భాష వలి, రమేష్, చెన్నకేశవరెడ్డి, నూర్జహాన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఐకేపీ అక్రమాలపై విచారణ

- విచారణకు ఆదేశించిన జేసీ శ్రీజ
- ఏపీడీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన బృందం
- మొట్లగూడెం అక్రమంపై అవాక్కైన విచారణ బృందం
- మహా వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలో ఐకేపీలో జరిగిన అక్రమాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఎట్టకేలకు విచారణకు ఆదేశించారు. జెసి ఆదేశాలతో డీఆర్ డీవో ఏపీడీ జయశ్రీ బృందం బుధవారం కారేపల్లి ఐకేపీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. బకాయిలు పడ్డ స్వయం సహాయక సంఘాలు, మొండి బకాయిల ఫైళ్ళను పరిశీలించారు.

**మొట్లగూడెం అక్రమంపై అవాక్కైన అధికారులు...**

మండలంలోని మోట్లగూడెం గ్రామంలో స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో గ్రామంలో లేని వారి పేర్లతో రుణాలు కాజేసిన వ్యవహారం పై విచారణ అధికారులు అవాక్కయ్యారు. ఉత్తుత్తి గ్రూపులతో 12 లక్షల రూపాయలను కాజేసిన తీరుపై పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. ఈ అక్రమం పై మహా దినపత్రికలో ఆధారాలతో వచ్చిన కథనాలన్నీ అక్షర సత్యాలుగా విచారణ అధికారులు గుర్తించారు. కొందరు ఐకేపీ అధికారులు బ్యాంకు అధికారి కుమ్మక్కై చేసిన ఈ అక్రమంపై పూర్తి స్థాయిలో ఆధారాలు కూడా సేకరించారు. విచారణ నివేదికను జేసీ కి సమర్పిస్తామని ఏపిడి తెలిపారు.

# దశాబ్దాల కళ నెరవేరుతున్న వేళ

- జూలూరుపాడు మార్కెట్ పనులు ప్రారంభం
- భూమి పూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు



**జూలూరుపాడు, మహా:** జూలూరుపాడు మండల కేంద్రంలోని రైతుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. మండల కేంద్రంలోని ఒంటి గుడిసె క్రాస్ రోడ్డు సమీపంలో ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో శాశ్వత మార్కెట్ నిర్మాణ పనులు బుధవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.3.03 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. నిర్మాణానికి సంబంధించిన తొలుత భూమి చదును చేయడం, చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాలకు అధికారులు, నాయకులు కలిసి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ...నెల రోజుల్లోపు భూమి చదును చేసే ప్రక్రియను పూర్తి చేస్తామని, వచ్చే సీజన్ నాటికి మార్కెట్ భవన నిర్మాణాలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శాశ్వత మార్కెట్ యార్డ్ అందుబాటులోకి వస్తే చుట్టు పక్కల గ్రామాల రైతులకు పంట ఉత్పత్తుల విక్రయంలో ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఎం.ఏ.అలీం, డీఈ వివేక్, ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం, మార్కెట్ కార్యదర్శి అనూష, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్ తోపాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భక్తి మార్గంలోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుంది

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**




**రాజేంద్రనగర్ మహా ;** గ్రేటర్ హైదరాబాద్, శంషాబాద్ జోన్ పరిధిలోని ఇంద్రానగర్ దొడ్డిలో మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామి నూతన దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని అత్యంత వైభవంగా వేద పండితులచే వేదమంత్రాల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజ కార్యక్రమం పూర్తి చేశారు. అనంతరం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులతో కలిసి, బండి గోపాల్ యాదవ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బండి గోపాల్ యాదవ్ పట్టుదలతో అకుంఠిత దీక్షతో ఆంజనేయ స్వామి నూతన దేవాలయాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారని. ఈ సమాజంలో భక్తి మార్గంలోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇంద్రానగర్ దొడ్డిలో అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రజలందరికీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్,నిరటి రాజు, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్,మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ల పల్లి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు వ్యాపారస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రముఖ సంఘసంస్కర్త వ్యాపారవేత సిద్దిరెడ్డి




**రాజేంద్రనగర్ మహా ;** గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ బస్ స్టాప్ పక్కనే వేసవి తాపాన్ని తట్టుకునే మజ్జిగ కేంద్రాన్ని బుధవారం సినిమా ఆర్టిస్ట్ ఇంద్రసేనతో కలిసి ప్రముఖ వ్యాపారవేత్త సంఘసంస్కర్త సిద్ది రెడ్డి ప్రారంభించారు. వేసవికాలం నేపథ్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శంషాబాద్ లోని బస్ స్టాప్ పక్కనే ప్రయాణికులు,శరణార్థులకు దాహార్తిని తీర్చే మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. బస్ స్టాప్ నుంచి ఇతర గ్రామాలకు ప్రయాణించి ప్రతి ఒక్కరు మజ్జిగ కేంద్రాన్ని వినియోగించుకొని దాహార్తిని తీర్చుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త సంఘ సంస్కర్త సిద్ధి రెడ్డి తెలిపారు.

## రేడియల్ రింగ్ రోడ్ ను తమ గ్రామంలో నుంచి కాకుండా

# బయట నుంచి తీసుకెళ్లాలి

- గ్రామసభలో అడిషనల్ కలెక్టర్ చందా రెడ్డికి గ్రామస్తులు
- వినతి పత్రం అందజేత



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం రామాంజపూర్ గ్రామంలోంచి కాకుండా రేడియల్ రింగ్ రోడ్డును గ్రామం బయటి నుంచి తీసుకెళ్లాలని గ్రామసభలో ఆర్డిఓ వెంకట్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి కి గ్రామస్తులు బుధవారం వినతి పత్రం అందజేశారు. రామంజపూర్ గ్రామం మధ్యలోంచి భూ సేకరణ చేశారు. అలా చేయటం వల్ల గ్రామానికి వాస్తు దోషం తో పాటు గ్రామాన్ని రెండుగా విరదీసినట్టు అవుతుందన్నారు. గ్రామం మధ్యలోంచి రేడియోల్ రింగ్ రోడ్ భూ సేకరణలో హద్దులు ఏర్పాటు చేశారు. హద్దులను తొలగించి గ్రామం బయటి నుంచి రేడియో రింగ్ రోడ్డు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, మాధవరెడ్డి, క్రాంతి, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి వేయించాలి

**పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్**



**మొయినాబాద్ మహా:** పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పశు పెంపకదారులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నమంగళారం గ్రామ ఉపసర్పంచ్ అవిశీపేట ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. చిన్నమంగళారం గ్రామంలోని రైతుల వద్ద ఉన్న 145 పశువులకు ఎఫ్ఎండీ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నమంగళారం గ్రామ ఉపసర్పంచ్ అవిశీపేట ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు ఎలాంటి వ్యాధులు కలిగిన వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువనాయకులు తలారి నరేష్ , వార్డు సభ్యులు చేగురి రాత్నయ్య పశువైద్య సహాయక సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావు, గోరేమియా, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మతమార్పిడిలపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాచమల్ల రమేష్ మాదిగ**



**రాజేంద్రనగర మహా ;** క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాచమల్ల రమేష్ మాదిగ సమర్థించారు. గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ తన కార్యాలయంలో మాట్లాడుతూ షెడ్యూల్ కులానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత కూడా ఎస్సీ హోదాని కొనసాగించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ తీర్పునిచ్చింది. తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తీర్పును స్వాగతించారు. మతమార్పిడి చేసుకున్న సదురు వ్యక్తి తిరిగి స్వామతంలోకి మారినట్టు ఆధారాలు ఉంటే తప్ప ఎస్సీ హోదా పునరుద్ధరించకూడదని ధర్మస్థానం పేర్కొంది. తీర్పుపై ఎంఆర్పిఎస్ నాయకులు రమేష్ మాదిగ సంతృప్తి వ్యక్తపరిచారు.

## పెట్రోల్ డీజిల్ కొరత లేదు..

# పుకార్లను నమ్మొద్దు...!

- ప్రజలు పెట్రోల్ డీజిల్ పై ఆందోళన చెందవద్దు
- సోషల్ మీడియాలో పుకార్లు సృష్టిస్తే చర్యలు తప్పవు
- క్యాన్లలో నింపి ఇళ్లలో దాచుకోవడం చట్టవిరుద్ధం శిక్షార్హులు
- ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్రంలో ఇంధన కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు పూర్తిగా అవాస్తవం అని ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఆయిల్ కంపెనీల నుండి రాష్ట్రంలో నలుమూల్లలో ఉన్న బంకులకు పెట్రోల్ డీజిల్ సరఫరా నిరంతరాయంగా జరుగుతోందని, ఎక్కడా కూడ సరఫరా ఆగలేదని సిపి సుధీర్ బాబు వెల్లడించారు.. కొరత ఉందన్న భయంతో ప్రజలు ఒక్కసారిగా బంకులకు రావడం వల్లే రద్దీ పెరుగుతోంది. దీనివల్ల కొన్ని బంకుల్లో స్టాక్ త్వరగా అయిపోతోంది తప్ప, అది అసలైన కొరత కాదని అన్నారు. పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి ఇళ్లలో దాచుకోవడం చట్టవిరుద్ధం (PESO నిబంధనల ప్రకారం) మరియు చాలా ప్రమాదకరం, దీనివల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన ప్రజలను హెచ్చరించారు. కావాలని పెట్రోల్, డీజిల్, కొరత ఉన్నట్లు సృష్టించినా లేదా సోషల్ మీడియాలో పుకార్లు ప్రచారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీకు ఎంత అవసరమో అంతే పోయించుకోండి, అనవసరంగా స్టాక్ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు, తప్పుడు వార్తలను నమ్మవద్దు అని ప్రజలకు, సిపి సుధీర్ బాబు సూచించారు. ఇతరులకు షేర్ చేయకండి. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండండి, అనవసరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి పుకార్లు సృష్టించవద్దని మరోసారి ఆయన ప్రజలకు సూచించారు.

# సర్కార్ ఉద్యోగుల అద్దె భత్యం పెంచాలి!

- జిహెచ్ఎంసికి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో 24% హెచ్ఆర్ఏ ఇవ్వాలి
- టీజీవో అధ్యక్ష కార్యదర్శులు జిల్లా ఉద్యోగులు
- జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డిని కలిసి విజ్ఞప్తి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిహెచ్ఎంసికి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు, హెచ్ఆర్ఏ 24% త్వరగా అమలు చేయాలని, టీజీఓ అధ్యక్ష కార్యదర్శులు డా కే రామారావు, శ్రీనేష్ కుమార్ నోరిలు, జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఐడిఓసి కొంగరకలాన్ నందు రంగారెడ్డి జిల్లా టీజీఓ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానించిన విధంగా... విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధికి చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, 24% ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ, రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని, డిఆర్ఓ సంగీత ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీజీఓ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు నూతనకంటి వెంకట్, అలివేలు, సైదమ్మ, రాకేష్, పావని, ఉమ, బాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు..

- నల్లగొండ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు..
- రూ. 30 వేల జరిమానా వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ, మహా :** నల్లగొండ పట్టణంలో ఎనిమిదేళ్ల క్రితం చోటుచేసుకున్న ట్రాక్టర్ డ్రైవర్ హత్య కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. నల్లగొండ ప్రత్యేక ఎస్సీ/ఎస్టీ (POA) చట్ట కేసుల విచారణ కోర్టు - II అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి ఈ మేరకు శిక్షను ఖరారు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఘటన వివరాల్లోకి వెళ్తే.. కనగల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పాలకురి రమేష్ (30) వ్యక్తిగత విభేదాలు, పాత గొడవల కారణంగా 2018 జనవరి 28వ తేదీ రాత్రి నల్లగొండ పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాం సమీపంలో దారుణ హత్యకు గురయ్యారు. మరుసటి రోజు ఉదయం మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ మొసిన్ ఖాన్ (A1) విచారణ దశలో ఉండగానే మరణించగా, రెండో నిందితుడు మొహమ్మద్ దుర్వేశ్ మొహియుద్దీన్ అలియాస్ నయాబ్ (A2) పై నేరం నిరూపితమైంది.నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితుడికి భారతీయ శిక్షాస్మృతి (IPC) సెక్షన్ 302 ప్రకారం జీవిత ఖైదుతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు సాక్ష్యాధారాల మాయం (IPC 201) కింద మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా, అలాగే సెక్షన్ 153(A) కింద మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించింది. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు అవుతాయని ఎస్పీ వివరించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా పక్కా ఆధారాలతో కృషి చేసిన ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల, అప్పటి దర్యాప్తు అధికారులు సబ్ ఇన్స్పెక్టర్ డి. మధు, సీఐలు ఎన్. వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషాలను ఎస్పీ అభినందించారు. అలాగే ప్రస్తుతం ఈ కేసును పర్యవేక్షించిన డీఎస్పీ శివరాం రెడ్డి, టూటౌన్ సీఐ ఎస్. రాఘవరావు, ఎస్ఐ వై. సైదులు, సీడీఓ సుమన్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు నరేందర్, మల్లికార్జున్‌లను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభం



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్‌ను బుధవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి. బాల భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గవర్నమెంట్ ప్లీడర్ కె. రాంచందర్ రెడ్డిని అభినందించారు. న్యాయవ్యవస్థలో సేవలందిస్తున్న గవర్నమెంట్ ప్లీడర్లకు సౌకర్యాలు మెరుగుపడేందుకు ఈ ఛాంబర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అదనపు జిల్లా జడ్జి అమరావతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి. కిరణ్ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, మూడవ జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఏజీపీ సునితా రాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పలు పెట్రోల్ బంకులు

# మూసివేత

**రాజేంద్రనగర్ మహా ;** గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ జోన్ పరిధి గగన్ పహాడ్ నుంచి శంషాబాద్ వైపు వెళ్లి, వచ్చే రహదారిలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మంగళవారం సాయంత్రం నుంచి సోషల్ మీడియాలో పెట్రోల్ బంకులు మూసివేసినట్టు ప్రచారం జరగడంతో, అరంఘర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో 9 పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలు పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరాయి. అందులో కొన్ని పెట్రోల్ బంకులు భారీ క్రేడ్లు ఏర్పాటు చేసి బంకులు మూసివేశారు. మరి కొన్ని పెట్రోల్ బంకులు బారులు తీరిన వాహనాలతో కిక్కిరిసిపోయి రోడ్లపై క్యూ లైన్ లో నిలిచాయి. దీనితో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లి, వచ్చేవారు ట్రాఫిక్ జామ్ తో ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ కొరత లేదంటూ తెలిపిన పెట్రోల్ పంపుల వద్ద వాహనదారుల రద్దీ తగ్గడం లేదు.

# అన్ని దానాల కన్న విద్య దానం ఎంతో గొప్పది

- మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు
- పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా గణితశాస్త్రం ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేసిన గరుగు రాజు



**మొయినాబాద్ మహా:** అన్ని దానాలకన్న విద్యదానం ఎంతో గొప్పదని, తన శయశక్తులు ఉన్నంతవరకు ప్రజలకు సేవా చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు తెలిపారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్సరాల నుంచి గణితశాస్త్రం ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు తన సొంత డబ్బులతో ప్రైవేటు ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేయించి పదవ తరగతి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే కార్యక్రమం చేపట్టాడు. ఇందులో బాగంగా బుధవారం హిమాయత్ నగర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గరుగు రాజు ప్రైవేటు ఉపాధ్యాయుడు మహేందర్ కు తన వంతు ఆర్థిక సహాయం చేశాడు. ఈ కార్యక్రమంలో గరుగు రాజు మాట్లాడుతూ అన్ని రంగాల్లో దానాలు చేయడం సహజమని విద్యరంగంలో సహాయం చేయడం తనకు వచ్చినా మంచి అవకాశమన్నారు. జీవితంలో అన్ని చేస్తుంటామని ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు చేయడం తనకు ఎంతో ఇష్టమన్నారు. తన జీవిత లక్ష్యం ప్రజలకు సేవా చేయడమేనన్నారు. అన్ని దానాలకెల్లా విద్యదానం ఎంతో గొప్పదన్నారు. సాటివారికి సహాయం చేయడం మానవుని లక్ష్యమని తాను నిత్యం ప్రజల్లో ఉంటానని అందరికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు నిరంతర కృషి ఉంటుందని చెప్పారు. ప్రతి రంగాల్లో అనేక మంది వ్యాపారాలు నిర్వహిస్తుంటారని.. అదే విధంగా అన్ని రంగాల్లో సేవా చేయడం కూడా అలవార్చుకోవాలని తెలిపారు. ఇప్పుడు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లయ్య, ప్రదానోపాధ్యాయులు జులేఖా సుల్తాన, నాయకులు చదువు రాంచందర్, ఉపాధ్యాయులు అరుణమ్మ, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో అకాల వర్షా లు రైతుల్లో ఆందోళన!

- పంటలు ఆగమయ్యే పరిస్థితి ఉందన్న రైతులు
- చల్లారిన వేడి తాపం ఉపశమనంతో ప్రజలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో అక్కడక్కడ కురిసిన భారీ వర్షాలకు రైతులు ఆగమాగం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా రాష్ట్రంలో ఎండలు భగభగమని మండుతుండడంతో ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. వేడి తాపాన్ని తట్టుకోలేక ఇండ్లకే పరిమితమైతున్నారు. బుధవారం జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారి ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వేడి తాపం కొంతవరకు చల్లారింది. కానీ రైతులలో ఆందోళన నెలకొంది. జిల్లాలోని పలు నియోజకవర్గాలలో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంటలు ఆగమాగం అయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన అకాల వర్షంతో వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**ఉరుములతో కూడిన భారీ వర్షం..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షం సుమారు రెండు గంటల పాటు విరామం లేకుండా కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వేడి తాపం చల్లారిన, రైతులలో ఆందోళన నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఈ అకాల వర్షాలతో ఆగమయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిసిన అకాల వర్షంతో వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# విద్యారంగ బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**మంచిర్యాలజిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, మహా:** విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వపాఠశాలలో త్రాగునీరు,విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సౌకర్యాలను కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యబోధన అందించేదిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఉన్నత లక్ష్యాలనుఎంచుకుని వాటినిసాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ, నివాస ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లనునిబంధనలప్రకారం నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం లంబడితండ (కె) గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలుఅందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు రుణాల మంజూరులో జాప్యం వద్దు..

- బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి..
- బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం..
- రూ. 16,861 కోట్లతో నాబార్డ్ రుణ ప్రణాళిక విడుదల..







**నల్గొండ, మహా :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత రంగ పథకాల గ్రౌండింగ్ లక్ష్యాలను బ్యాంకర్లు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ (డి.సి.సి) సమావేశంలో ఆయన మాట్లాడారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్, డిసెంబర్ త్రైమాసికాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనపై బ్యాంకుల నియంత్రణ అధికారులు, జిల్లా అధికారులతో కలిసి ఆయన కూలంకషంగా సమీక్షించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా.. వ్యవసాయ రుణాలు, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (MSME), టర్మ్ లోన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డి.ఆర్.డి.ఏ, మెప్మా, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందజేసే రుణాల గ్రౌండింగ్‌ను ఈ నెల 30 లోపు పూర్తి చేయాలి. ఆర్‌సెటీ (RSETI) ద్వారా శిక్షణ పొందిన అతి పేదవారు, చిరు వ్యాపారుల రుణ దరఖాస్తులను బ్యాంకర్లు 'పెద్ద మనసుతో' ఆలోచించి జాప్యం లేకుండా మంజూరు చేయాలని సూచించారు.

**రుణాల మంజూరులో వేగం పెంచాలి..**

గృహ నిర్మాణం, విద్యా రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) వంటి బ్యాంకులు విద్యార్థులకు ఇచ్చే రుణాలపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ ద్వారా జారీ చేసే కిసాన్ క్రెడిట్ కార్డుల విషయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామర్థ్య ఆధారిత రుణ ప్రణాళిక (PLP) పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. వచ్చే ఏడాదికి గాను మొత్తం రూ. 16,861 కోట్ల అంచనాతో ఈ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.సమావేశంలో ఆర్.బి.ఐ ఎల్.డి.ఓ గోమతి, నాబార్డ్ డి.డి.ఎమ్ వినయ్, డీసీసీబీ సీఈఓ శంకర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకుల నియంత్రణ అధికారులు పాల్గొన్నారు

## పారదర్శకంగా పాత సామగ్రి వేలం..

- టెండర్ దారుల సమక్షంలో ప్రక్రియ పూర్తి..
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..



**నల్లగొండ, మహా:** జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన పాత, ఉపయోగించని సామగ్రిని టెండర్ దారుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా బహిరంగ వేలం వేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ నియమించిన ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ నిర్వహించబడింది. కాలం చెల్లిన పాత టైర్లు, బ్యాటరీలు, ఖాళీ ఆయిల్ డ్రమ్ములు, ఇనుప విడి భాగాలు వంటి వివిధ రకాల పాత సామగ్రిని ఈ సందర్భంగా వేలం వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, విధివిధానాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఈ వేలం కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. పోలీస్ శాఖలో ఉపయోగపడని పాత సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా కార్యాలయ ప్రాంగణంలో శుభ్రతను పాటించవచ్చని, అదే సమయంలో పారదర్శక వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. శాఖా పరమైన నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు ఇలాంటి చర్యలు దోహదపడతాయని వివరించారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలం కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్.బి డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ టౌన్ సీఐ రాఘవేందర్ రెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీను పాల్గొన్నారు. వీరితో పాటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సూర్య నాయుడు, వెల్ఫేర్ ఆర్.ఐ సంతోష్ మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంధనానికి కొరత లేదు

**కలెక్టర్ బి.చంద్రశేఖర్..**

- వదంతులు నమ్మవద్దు నిల్వలు నిండుగా ఉన్నాయి..
- బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు పెడితే చర్యలు..
- అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో వెల్లడి



**నల్గొండ, మహా :** నల్గొండ జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని, వినియోగదారులు ఆందోళనతో ముందస్తుగా ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన సరఫరా పరిస్థితిపై బుధవారం ఆయన పౌర సరఫరాల అధికారులు, పెట్రోల్, గ్యాస్ డీలర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కొన్నిప్రాంతాల్లో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని కలెక్టర్ ఖండించారు. జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయని అనవసర భయాందోళనలతో ప్రజలు బంకుల వద్ద ఎగబడటం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉంది. ఏ బంకు వద్ద కూడా 'నో స్టాక్' బోర్డులు ప్రదర్శించకూడదు. సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని పోలీసులతో పాటు గ్రామ పరిపాలన అధికారులు, కారోబార్లకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. డీలర్లకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న మూడు నాలుగు రోజులు అత్యంత కీలకమని ఈ సమయంలో గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల వద్ద రద్దీని నియంత్రించాలని సూచించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం.. ఎస్పీ**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. ఇంధన సరఫరా కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొని క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు.

## డిసిపికి అభినందనలు తెలిపిన కొత్త రామారావు




**కుషాయిగూడ, మహా :** నూతనంగా ఏర్పడిన ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్, కొల్లు సురేష్ కుమార్ ను మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి జ్ఞాపకను అందించి శుభాకాంక్షలు తెలుపుతూ శాంతి భద్రతల విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విన్నవించారు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పరిణామాలపై డిసిపి దృష్టికి తీసుకెళ్లారు. డిసిపిని కలిసిన వారిలో నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, కనక మేడల రాంబాబు, పి నాగేశ్వరరావు, ఉప్పల సుకుమార్ తదితరులున్నారు

## వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవద్దు

- ఇంధనం కోసం ఆందోళన వద్దు
- కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ ఆర్ ఎల్ ఎన్ రాజు



**కుషాయిగూడ, మహా :** సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దు ఇంధన కొరత అంటూ వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి వాహన దారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకుల మీదకు వచ్చి బారులు తీరుతూ ఇబ్బందులు ఎదుర్కోవద్దు అని ట్రాఫిక్ సీఐ ఆర్ ఎల్ ఎన్ రాజు వాహన దారులకు తెలిపారు. రోడ్లపైకి ఒక్కసారిగా రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయంతో పాటు వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కోవడం పట్ల స్పందిస్తూ పెట్రోల్ బంకుల వద్ద నుండి రోడ్లపై వరకు బారులు తీరుతున్నారని ఇంధన కొరత ఏమాత్రం ఉండబోదన్నారు. సోషల్ మీడియాలో వదంతులు సృష్టిస్తే తప్పుడు రాతలు రాస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ ఉందని, పెట్రోలు లేదు అన్న వదంతులను నమ్మవద్దని వాహనదారులకు ఆయన సూచించారు. ఒకేసారి పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు వస్తే ట్రాఫిక్ సమస్య స్తంభవిస్తాదని ప్రయాణికులకు రాకపోకలు ఇబ్బందులు వస్తాయన్నారు. వాహనదారులు ఒకేసారి రావడం వల్ల ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

# విశ్వవేదికపై భారతీయ విద్యా ప్రభ

- క్యూఎస్ ర్యాంకింగ్స్ లో మన వర్సిటీల జోరు!
- టాప్-50లో 27 సబ్జెక్టులు..
- విద్యా రంగంలో భారత్ సరికొత్త రికార్డు
- ఐఐటీల ఆధిపత్యం.. బిట్స్ పిలానీ సంచలనం
- గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో 99 వర్సిటీలు
- ఇంజినీరింగ్, టెక్నాలజీలో మనమే సాటి..
- ప్రపంచ విశ్వవిద్యాలయాల జాబితాలో భారత్ ముందంజ



**హైదరాబాద్, మహా:** ప్రపంచ ఉన్నత విద్యా రంగంలో భారతీయ విశ్వవిద్యాలయాలు తమ సత్తాను మరోసారి చాటుకున్నాయి. ప్రతిష్ఠాత్మక 'క్యూఎస్ (QS) క్వాక్వారెల్లి సైమండ్స్' విడుదల చేసిన 2026 సబ్జెక్ట్ వారీ గ్లోబల్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ ఏడాది కేవలం విద్యా సంస్థల సంఖ్యలోనే కాకుండా, నాణ్యత పరంగా కూడా దేశం గణనీయమైన పురోగతిని సాధించడం విశేషం. మొత్తం 99 భారతీయ విశ్వవిద్యాలయాలు ఈ జాబితాలో చోటు సంపాదించగా, గత ఏడాది కంటే కొత్తగా 20 విద్యా సంస్థలు ఈ అంతర్జాతీయ వేదికపైకి రావడం భారత విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అద్దం పడుతోంది. సబ్జెక్టుల వారీగా చూస్తే భారత్ నుంచి 120 కొత్త ఎంట్రీలు నమోదయ్యాయి. ఈ విభాగంలో అమెరికా, చైనా, యుకే తర్వాత అత్యధిక ఎంట్రీలు సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. ఐఐటీల ఆధిపత్యం ఈ ర్యాంకింగ్స్‌లో సుస్పష్టంగా కనిపిస్తోంది. ఐఐటీ బాంబే అత్యధిక సబ్జెక్ట్ ఎంట్రీలతో అగ్రస్థానంలో నిలవగా, ఐఐటీ ఖరగ్‌పూర్, ఢిల్లీ యూనివర్సిటీ, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ సంస్థలు వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది భారత్‌కు చెందిన సబ్జెక్ట్ ఎంట్రీలలో దాదాపు సగం మెరుగైన స్థానాలు సాధించడం విశేషం. మొత్తం 265 ఎంట్రీలు తమ ర్యాంకులను మెరుగుపరుచుకోగా, కేవలం 80 మాత్రమే స్వల్ప తగ్గుదలని చూశాయి. ఈ ఎదుగుదల వేగం యూఏఈ, యుకే, ఇండోనేషియా వంటి దేశాల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగాల్లో భారత్ తిరుగులేని వేగంతో దూసుకెళ్తోంది. గత ఐదేళ్లలో ఈ సబ్జెక్టులలో భారతీయ ఎంట్రీలు 65 శాతం పెరగడం దేశ సాంకేతిక విద్యా బలాన్ని చాటుతోంది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో గత ఏడాది కేవలం రెండు సంస్థలు మాత్రమే టాప్ 100లో ఉండగా, ఈసారి ఆ సంఖ్య ఆరుకు చేరడం విశేషం. వ్యక్తిగత విద్యా సంస్థల ప్రదర్శనలో బిట్స్ (BITS) పిలాని అద్భుతమైన ప్రగతిని కనబరిచింది. ఫార్మసీ అండ్ ఫార్మకాలజీ విభాగంలో గతంలో 84వ స్థానంలో ఉన్న ఈ సంస్థ, ఏకంగా 45వ ర్యాంకుకు చేరుకుని తొలిసారి టాప్ 50లో నిలిచింది. మొత్తం మీద భారత్ ఈ ఏడాది 27 టాప్ 50 స్థానాలను కైవసం చేసుకుంది. 2024లో ఈ సంఖ్య కేవలం 12 మాత్రమే ఉండటం గమనార్హం. ఐఐటీ అహ్మదాబాద్ బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మార్కెటింగ్ విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా 21వ ర్యాంక్ సాధించగా, మార్కెటింగ్ విభాగంలో భారత్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో ప్రవేశించడం ఇదే తొలిసారి. అలాగే ఐఐటీ ధన్బాద్ మినరల్ అండ్ మైనింగ్ ఇంజినీరింగ్‌లో 21వ స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు ఐఐటీ ఢిల్లీ ఈసారి అత్యుత్తమ సమగ్ర ప్రదర్శనతో ఆకట్టుకుంది. కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌తో పాటు మొత్తం ఆరు సబ్జెక్టుల్లో ప్రపంచ టాప్ 50లో చోటు సంపాదించి తన ప్రత్యేకతను చాటుకుంది. భారత విద్యా సంస్థల ఎదుగుదలపై క్యూఎస్ సీఈఓ జెస్సికా టర్నర్ స్పందిస్తూ, ఈ పురోగతి కేవలం సంఖ్యలకే పరిమితం కాలేదని, నాణ్యతలోనూ భారత్ ప్రపంచ స్థాయి పోటీని ఇస్తోందని కొనియాడారు. పరిశోధనలు, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా భవిష్యత్తులో భారత్ మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ 2026 ఫలితాలు భారత ఉన్నత విద్యా వ్యవస్థ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోందనే నిజానికి సజీవ సాక్ష్యంగా నిలిచాయి.



## వైన్స్ షాపులకు దేవుని పేర్లు తీసేయాలి

**అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్**

**మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు దేవుని పేర్లు తీసేయాలని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. ఇకపైన మద్యం దుకాణాలకు దేవుడి పేర్లు పెట్టకుండా చట్టాలు తీసుకురావాలని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. దేవుళ్ళ పేర్లు పెట్టి హిందూ మతాన్ని అవమానిస్తున్నారని, దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఇకపైన లైసెన్సులు ఇచ్చేటప్పుడే దేవుని పేర్లు మద్యం దుకాణాలకు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు.

**వందల దుకాణాలకు దేవుడి పేర్లు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది సంఖ్యలో మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ మద్యం దుకాణాలకు ఎక్కువమంది దేవుడి పేర్లు పెడుతున్నారు. రేణుక ఎల్లమ్మ, మైసమ్మ తల్లి, వెంకటేశ్వర వైన్స్, అంటూ రకరకాల హిందూ దేవతల పేర్లు పెట్టుకుని మద్యం దుకాణాలు నడిపిస్తున్నారు. హిందూ దేవుళ్ళ పేర్లు పెట్టుకుని మద్యం దుకాణాలను నడిపిస్తే మంచి గిరాకీ వస్తుందని జనాల నమ్మకం. అందుకే ఇలా పేర్లు పెట్టుకుంటూ ఉంటారు. అయితే ఇకపైన మద్యం దుకాణాలకు దేవుడి పేర్లు పెట్టకూడదని బీజేపీ కొత్త డిమాండ్ తెరపైకి తీసుకువచ్చింది.

## క్రీడాకారులకు నగదు బహుమతులు పంపిణీ




**ఆలేరు, మహా:** ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవాలలో 2026 కోకో పోటీలలో విజయం సాధించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు విన్నర్స్, రన్నర్స్ క్రీడాకారులకు బుధవారం బిజెపి నాయకులు నగదు బహుమతులు అందజేశారు... భువనగిరి పార్లమెంటు స్థాయి కో కో విజేతలు ఆర్పిఆర్పి గురుకుల క్రీడాకారులకు 30 వేల నగదు బహుమతి, ఆలేరు అసెంబ్లీ స్థాయి కోకో మొదటి విజేతలైన మైనార్టీ స్కూల్ క్రీడాకారులకు 25 వేలు, ZPHS ద్వితీయ స్థానం బాలిక క్రీడాకారులకు 15 వేల రూపాయలలను బిజెపి నాయకులు పంపిణీ చేశారు... ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిరిగే శ్రీనివాస్, గంగేష్, కామిటికారి కృష్ణ, ప్రవీణ్ రెడ్డి, నర్సింహులు, కుమారస్వామిలు వున్నారు క్రీడా పోటీలు నిర్వహించిన PD పూల నాగయ్యను బిజెపి నేతలు శాలువాతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో ZPHS స్కూల్ ప్రధానోపాధ్యాయులు మంజుల, మైనార్టీ స్కూల్ ఇన్ చార్జ్ కవితతో పాటు PET,ఉపాధ్యాయులు మైదం రంగయ్య ఉన్నారు.

## ఆన్ లైన్ యూరియా యాప్ రద్దు చేయాలి....

**మహాసభలో రైతుల డిమాండ్**



**ఆలేరు, మహా:** రైతులు ఆన్ లైన్ లో యూరియా బుక్ చేసుకునే పద్ధతి తొలగించి పాత పద్ధతిలో రైతులకు యూరియా ఇవ్వాలని బుధవారం నాడు జరిగిన రైతు మహాసభలో రైతులు డిమాండ్ చేశారు .. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాసభ ఇన్ చార్జ్ అధికారి అశోక్ ఆధ్వర్యంలో జరిగిందిఈ మహాసభలో సంఘం సెక్రెటరీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆలేరు సంఘం పరిధిలో 23 గ్రామ పంచాయతీలు,ఒక మున్సిపాలిటీ వున్నాయని తెలిపారు...300 రూపాయల సభ్యత్వంమొత్తం 6658 మంది సభ్యులు 2,41,14,002 రూపాయలు వున్నాయని వివరించారు సంఘం నుండి 1704 మంది రైతులు 12,40,03,731 రూపాయలు పంట రుణాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు దీర్ఘ కాలిక ఋణాలు 253 మంది రైతులు 9,95,28,891 రూపాయలు, సంఘం నుండి 39 మంది SUP రుణాల కింద 10,77,121 రూపాయలు తీసుకున్నారని తెలిపారుఆలేరు, గొలనుకొండ,కొల్లూరు గోదాములలో ఎరువుల నిల్వలు ఆయన వివరించారు...ఈ సందర్భంగా రైతులు ఆబ్ లైన్ యూరియా బుకింగ్ తొలగించాలని కోరారు...ఈ సభలో సిపిఐ నాయకులు చెక్క వెంకటేష్, మాజీ డైరెక్టర్లు గవరవల నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలలో కుప్పకూలిన విద్యార్థి

- చికిత్స పొందుతూ మృతి
- తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడి మృతి సంచలనంగా మారింది. ఆదర్శ నగర్, కాప్రాకు చెందిన బ్రహ్మదండి జ్యోతి తన కుమారుడు సూరజ్ కుమార్ (14) మృతి పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, సూరజ్ కుమార్ వాసవి శివనగర్‌లోని గోపీ మెమోరియల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మార్చి 6 ఉదయం పాఠశాల ప్రాంగణంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో పాఠశాల యాజమాన్యం వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. మొదట కొరల్ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం మెడికోవర్ ఆసుపత్రికి మార్చారు. అక్కడే అదే రోజు రాత్రి మెదడుకు శస్త్రచికిత్స నిర్వహించారు. తరువాతి రోజు గాంధీ ఆసుపత్రికి తరలించగా, మార్చి 8 తెల్లవారుజామున బాలుడు మృతి చెందాడు. అనంతరం కుషాయిగూడలో అంత్యక్రియలు నిర్వహించారు. వైద్యుల ప్రకారం, మెదడులో రక్తం గడ్డకట్టడం వల్లే మృతి సంభవించినట్లు తెలిపారు. అయితే, ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేసిన తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు మార్చ్ 25 బుధవారం రోజు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వీధి వ్యాపారులకు అండగా పరమేశ్వర్ రెడ్డి

- ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వ్యాపారాలకు అవకాశం
- ట్రాఫిక్ పోలీసులతో చర్చించి సమస్యకు పరిష్కారం



**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ ప్రాంతంలో వీధి వ్యాపారులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అండగా నిలిచాడు. రోడ్డుపై నుంచి తొలగింపుల బెడద ఎదుర్కొంటున్న వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి, యథావిధిగా వ్యాపారం కొనసాగించేలా మార్గం సుగమం చేశాడు. ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఉప్పల్ రింగ్ రోడ్డులో ఉన్న వరంగల్ బస్ స్టాప్‌ను నల్లచెరువు ప్రాంతానికి తరలించేందుకు అధికారులు నిర్ణయించారు. దీంతో అక్కడి వీధి వ్యాపారులను ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు ఆదేశించారు. ఈ విషయాన్ని వ్యాపారులు పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వారు ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన పరమేశ్వర్ రెడ్డి బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు రామలింగ రెడ్డి, నాగరాజుతో చర్చలు జరిపాడు. అధికారులతో కలిసి నల్లచెరువు ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా అదే పరిసరాల్లో వ్యాపారాలు చేసుకునేలా ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాడు. దీనిపై వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## చనిపోతానంటూ భర్తకు వాట్సప్ సందేశం

**భార్య అదృశ్యం**



**కుషాయిగూడ, మహా:** తాను చనిపోతానంటూ భర్త ఫోన్ కు వాట్సప్ సందేశం పంపి... భార్య ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ లోని అరుంధతినగర్ లో పులిగిల్ల రమేష్, భార్య లత, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 24న భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా ఇంట్లో చెప్పకుండ భార్య లత బటయకు వెళ్ళితిరిగి రాలేదు. మరుసటి రోజు 25న భర్త రమేష్ ఫోనకు తాను చనిపోతానంటూ వాట్సప్ సందేశం పంపింది. లత(34) కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ**



**కుషాయిగూడ, మహా :** ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం లభిస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని దొండ తోట కాలనీ వాస్తవ్యులైన గొడుగు సంధ్య యాకయ్య దంపతులకు ఇటీవలే ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం చేపట్టగా సంధ్య యాకయ్యలు ఇటీవల ఇల్లు నిర్మించుకొని నూతన గృహప్రవేశానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గృహప్రవేశానికి జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి జవహర్ నగర్ లో పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఎంపిక ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజలకు నిలయమైన జవహర్ నగర్ లో ప్రభుత్వ పథకాలను సద్వినియం చేసుకోవడం ముదాభావమన్నారు. తెలంగాణలో ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం జరుగుతుందని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షునితో రిబ్బన్ కట్ చేసే గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బల్లి శ్రీనివాస్ గుప్తా, మాట్ల వినయ్, అరికల అనిల్ ముదిరాజ్, అశోక్ గుప్తా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# భూబకాసురుల గుట్టురట్టు!

**ఖైదీలైన ఖాకీ అధికారి, మరో ఎనిమిది మంది.. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. కీసర పోలీసుల చాకచక్యం**

**కుషాయిగూడ, మహా ;** అమాయకుల భూములపై కన్నేసి, నకిలీ పత్రాలతో కాజేయాలని చూసిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ ముఠాలో ఒక ఏఎస్ఐ స్థాయి పోలీసు అధికారి కూడా ఉండటం గమనార్హం. మరణ ధృవీకరణ పత్రాల నుంచి కుటుంబ సభ్యుల సర్టిఫికేట్ల వరకు అన్నింటినీ ఫోర్జరీ చేస్తూ, యజమానులకు తెలియకుండానే ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులతో సహా పలువురిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు.

**అసలేం జరిగిందంటే**

పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో ఇతరులకు బదలాయించారని కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు.

**అక్రమ మార్గం ఇలా**

ఈ ముఠా ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్లాట్లను, యజమానులు అందుబాటులో లేని భూములను లక్ష్యంగా చేసుకుంటుంది. మొదట అసలు యజమానుల వివరాలు సేకరించి, వారు చనిపోయినట్లు నకిలీ 'డెత్ సర్టిఫికేట్లు' సృష్టిస్తారు. ఆపై నకిలీ వారసులను పుట్టించి, గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్లు, సేల్ డీడ్ల ద్వారా భూములను తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తారు. రెండు వేర్వేరు కేసుల్లో పోలీసులు నిందితులను గుర్తించారు. మొదటి కేసులో కనకాటి లింగయ్య గౌడ్ (ఏఎస్ఐ), ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీపలను అరెస్ట్ చేయగా.. రెండో కేసులో ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఫోర్జరీ చేసిన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**జాగ్రత్త వహించాలి: డిసిపి**

"భూముల కొనుగోలు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలి" అని మల్కాజిగిరి డిసిపి శ్రీ చ. శ్రీధర్ సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని ఆయన అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.







## 23 ఏళ్లకే వ్యభిచారం కేసులో అరెస్ట్..

సినీరంగుల ప్రపంచంలో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. అందం, అభినయంతో కుర్రకారును కట్టిపడేసింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఊహించని విధంగా ఆమె కెరీర్ చిక్కుల్లో పడింది. 17 ఏళ్ల వయసులోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె తోపు హీరోయిన్. అప్పట్లో కుర్రాళ్ల కలల రాకుమారి. కానీ 23 ఏళ్ల వయసులో అనుహ్యంగా వ్యభిచారం కేసులో చిక్కుకుని అరెస్ట్ అయ్యింది ఈ భామ. ఆమె మరెవరో కాదు హీరోయిన్ శ్వేత బసు ప్రసాద్. కొత్త బంగారు లోకం సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమా అప్పట్లో భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. 2008లో వచ్చిన కొత్త బంగారు లోకం సినిమాతో తెలుగు సినీరంగంలో ఆమె తిరుగులేని స్టార్ డమ్ సంపాదించుకుంది. ఇందులో ఆమె యాక్టింగ్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ చూసి ఫిదా అయ్యారు కుర్రాళ్లు. ఈ సినిమా తర్వాత ఆమె క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోతుందని అనుకున్నారు. తెలుగులో వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్ అవుతుందనుకున్నారు. కానీ ఆమెకు ఊహించిన స్థాయిలో ఆఫర్స్ రాలేదు. కొత్త బంగారు లోకం తర్వాత రైడ్, కాస్కో, కళవర్ కింగ్ వంటి చిన్న చిన్న సినిమాలు చేసింది. అవి ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోవడంతో ఆఫర్స్ కరువయ్యాయి. అదే టైంలో ఒక తప్పు ఆమె కెరీర్ నాశనం చేసింది. 2014లో హైదరాబాద్ లోని ఓ 5 స్టార్ హోటల్లో వ్యభిచారం కేసులో అరెస్ట్ అయ్యింది. ఈ ఘటన యావత్ సినీ ప్రపంచాన్ని షాక్ కు గురి చేసింది. ఆ తర్వాత ఆమె పై క్లీన్ చిట్ ఇచ్చారు పోలీసులు. సినీ నిర్మాత రోహిత్ మిట్టల్ ను పెళ్లి చేసుకున్న శ్వేత బసు ప్రసాద్ 9 నెలలకే అతడితో విడాకులు తీసుకుంది. కొన్నాళ్లు సైలెంట్ అయిన ఆమె ఇప్పుడు ఓటీటీలో వరుస వెబ్ సిరీస్, సినిమాలు చేస్తుంది.

## అతను నా క్లాస్‌మేట్..

పాన్ ఇండియా కథానాయికల్లో ఒకరు శృతి హాసన్. ఈమె నటుడు కమలహాసన్ వారసురాలు అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కథానాయకి, గాయని, సంగీత దర్శకురాలు ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభను చాటుకుంటూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటున్న నటి ఈమె. అంతేకాకుండా సంచనాలకు నిలయం శృతి హాసన్ అనే ట్యాగ్‌లైన్‌ను కూడా వేసుకున్నారీమె. సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటూ అభిమానుల్లో జోష్ నింపే ఈమె ప్రేమ వ్యవహారం  కూడా తెలిసిన పుస్తకమే. కాగా మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్ హీరోయిన్లలో ఈ బ్యూటీ ఒకరిగా ఉన్నారు.  కాగా ఇటీవల ఒక బేటిలో శృతిహాసన్ తన పాఠశాల జీవిత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అందులో భాగంగా నటుడు దుల్కర్ సల్మాన్ గురించి తెలిపారు. దుల్కర్ సల్మాన్ తాను బాల్యంలో చెన్నైలో ఓకే స్కూల్లో కలిసి చదువుకున్నామని చెప్పారు. రెండు ప్రముఖ పాఠశాలల్లో  తమ విద్యాభ్యాసం జరిగిందన్నారు. ఆ సమయంలో తాము తరచూ కలుసుకునేవారుమని చెప్పారు. ఆయన తనను సోంబి అని పిలిచేవాడన్నారు. అప్పట్లో పలువురు సహా విద్యార్థులతో కలిసి తాను సోంబి పాటను పాడిన అనుభవం ఉందన్నారు. ఆ తర్వాతనే తనను దుల్కర్ సల్మాన్ సోంబి అని పిలిచే వాడిని పేర్కొన్నారు. అతనితో కలిసి చదివిన విద్యార్థులకు తాను కమలహాసన్ కూతురు అన్న విషయం మాత్రమే తెలుసు అని, తన పేరు తెలియదని చెప్పారు. కాగా తాజాగా ఈ భామ దుల్కర్  సల్మాన్‌తో కలిసి  ఆకాశంలో ఒక తార అనే తెలుగు చిత్రం లో నటించడం విశేషం. ఈ చిత్రం తమిళం, కన్నడం మలయాళం హిందీ భాషల్లో రూపొందుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.  RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com